thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 75 | జగిత్యాల | బుధవారం | 10 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

వైభవం సంచలనం



11

## మా పాలనకు మహిళలే స్ఫూర్తి



అరటి రైతులను

### సంపద సృష్టికర్తలుగా మహిళలు!

- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట..
- మహిళల దెబ్బకే కొందరు ఫామ్‌హౌస్‌కు పరిమితం
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- కేసీఆర్ హయాంలో మంత్రి పదవులూ దక్కలేదు
- బీజేపీ కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 553 ఆర్టీసీ బస్సులు మహిళా సంఘాలకు పంపిణీ



తెలంగాణ మహిళలు కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే మిగిలిపో కుండా.. వ్యాపారవేత్తలుగా, ఆస్తుల యజమానులుగా, ఏకంగా సంపద సృష్టికర్తలుగా ఎదిగి ఆర్థిక సామ్రాజ్యాన్ని ఏలాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. సమాజంలో సగభాగమైన మహిళలకు అభివృద్ధి ఫలాల్లోనూ సమాన వాటా ఉండాలని, వారిని అప్పులు తీసుకునే స్థాయి నుంచి ఆస్తులు కూడబెట్టే స్థాయికి తీసుకురావడానికి విప్లవాత్మక అడుగులు వేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న బృహత్తర సంకల్పంతో.. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలు కొనుగోలు చేసిన ఐదొందల యాభై మూడు ఆర్టీసీ బస్సులను సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్

### ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై సీఎం సీరియస్

1వ తేదీనే వేతనాలు చెల్లించాలని హుకుం!

ఆలస్యమైతే శాఖాధిపతులు, డీడీఓలదే పూర్తి బాధ్యత..

## ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనాలని మరోసారి లేఖ



- 8 లక్షల టన్నుల మొక్కజొన్న కొన్నాం
- ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## పుణ్యస్నానానికి వెళ్లి పరలోకాలకు..

బాసర గోదావరిలో మునిగి ముగ్గురు సోదరుల మృతి

గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాల వెలికితీత

హైదరాబాద్‌కు చెందిన అన్నదమ్ములుగా గుర్తింపు

2



## నగరం.. అతలాకుతలం!



- మంగళవారం సాయంత్రం భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు.. భారీగా ట్రాఫిక్ ఇక్కట్లు
- విద్యుత్ షాక్ తో ఇరువురి మృతి
- గచ్చిబౌలిలో చెరువును తలపించిన రోడ్లు!



2

4

## రూ.వంద కోట్లకు పైగా!



మోహన్ నాయక్‌కు భారీగా అక్రమ ఆస్తులు

ఆర్ అండ్ బీ ఈఎన్సీ ఇంట్లో ఏసీబీ దాడులు

అవినీతి ఆరోపణలతో రోడ్లు, భవనాల శాఖ అధికారి మోహన్ నాయక్ నివాసాలపై ఏసీబీ సోదాల్లో.. వంద కోట్లకు పైగా అక్రమ ఆస్తులు, నగదు, బంగారం బయటపడ్డాయి.

2



ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని

## నిరూపిస్తావా

- నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా
- రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్

3

## జోజిలా.. ఓ మహాద్భుతం!



.. వివరాలు 3లో

## 14 రకాల నిత్యావసరాలు అందించాలి

- పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి అధోగతి
- ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
- సివిల్ సప్లైస్ కార్యాలయం ఎదుట ఐద్వా ధర్నా

3




## ఐరాసలో పాక్‌కు భారత్ హెచ్చరిక



పాక్ చర్యల ఖండన ▪ ఆఫ్ఘనిస్థాన్‌కు మద్దతు ప్రకటన

4



# జలమండలికి ప్రజాపాలన పెద్దపీట

**రూ.7,360 కోట్లతో గోదావరి ఫేజ్-2, 3 పనులకు శ్రీకారం**

**రూ.3,849 కోట్లతో 39 ఎస్టీపీల నిర్మాణానికి శంకుస్థాపన**

**2047 నాటికి హైదరాబాద్‌కు 24 గంటల నీటి సరఫరా లక్ష్యం**

**హైదరాబాద్, జూన్ 9:** హైదరాబాద్ మహానగరంతో పాటు శరవేగంగా విస్తరిస్తున్న పరిసర పట్టణ ప్రాంతాల తాగునీటి ఎద్దడిని నివారించేందుకు, మురుగునీటి సమస్యకు శాశ్వత విముక్తి కల్పించేందుకు తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం భారీ ప్రణాళికలకు శ్రీకారం చుట్టింది. జలమండలి పరిధిలో రూ.11,209 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రతిష్టాత్మక మెగా ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని, మల్లన్నసాగర్ జలాశయం నుంచి 20 టీఎంసీల గోదావరి జలాలను నగరానికి తరలించేందుకు రూ.7,360 కోట్ల వ్యయంతో గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్-2, 3 పనులను ప్రారంభించారు. దీని ద్వారా నగరానికి రోజుకు 300 ఎంజీడీల అదనపు తాగునీరు అందుబాటులోకి రానుంది. ఇందులో 17.5 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు, మిగిలిన 2.5 టీఎంసీలను మూసీ నది పునరుద్ధరణతో పాటు జంట జలాశయాల పునర్జీవనానికి వినియోగించనున్నారు. ఈ ప్రాజెక్టు పనులను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు నగరంలో 100 శాతం మురుగునీటి శుద్ధీకరణే ధ్యేయంగా అమృత్-2.0 పథకం కింద 972 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 39 కొత్త ఎస్టీపీల (మురుగునీటి శుద్ధి కేంద్రాల) నిర్మాణానికి రూ.3,849.10 కోట్లతో భూమిపూజ చేశారు. ఔటర్ రింగ్ రోడ్ (ా==) పరిధిలోని 39 ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్లను 2026 నాటికే పూర్తి చేయనున్నారు. వీటితో పాటు మూసీ వెంబడి ట్రంక్ సీవరేజ్ లైన్ల నిర్మాణానికి రూ.4,700 కోట్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలో భూగర్భ పైప్‌లైన్ల నెట్‌వర్క్ కోసం రూ.6,677 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఐటీ కారిడార్ కోకాపేట నియోపోలిస్ నీటి సరఫరా కోసం రూ.298 కోట్లు, చంద్రాయణగుట్ట సీవరేజ్ వ్యవస్థ బలోపేతానికి రూ.301 కోట్లు మంజూరు చేశారు. రాబోయే 2028 నాటికి రోజువారీ నీటి సరఫరాను క్రమబద్ధీకరించి, 2047 నాటికి నగరమంతటా 24 గంటల నిరంతర తాగునీటి సరఫరా అందించేలా జలమండలి బృహత్తర మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని, ఈ ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్తుకు శాశ్వత పరిష్కారం చూపనున్నాయని అధికారులు తెలిపారు.

# ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై సీఎం సీరియస్

**1వ తేదీనే వేతనాలు చెల్లించాలని హుకుం!**

**ఆలస్యమైతే శాఖాధిపతులు, డీడీఓలదే పూర్తి బాధ్యత..**

**హైదరాబాద్, జూన్ 9:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యానికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆలస్యమైతే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, డీడీఓలదే బాధ్యతని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాల బిల్లులు ట్రెజరీకి సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరులోపు బిల్లుల స్క్రూటినీ, ఆడిట్, అథరైజేషన్ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హుకుం జారీ చేశారు. బ్జడెట్ కొరత లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగాన్గ ÷నాన్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు. జీతాల చెల్లింపులో పరిపాలనా నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరిచారు. అన్నిశాఖలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు ఉత్తర్వులు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెల 1వ తేదీన జీతం చేరేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు ÷నాన్స్ శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్‌కు సమన్వయ బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారు.

# పుణ్యస్నానానికి వెళ్లి పరలోకాలకు

**బాసర గోదావరిలో మునిగి ముగ్గురు సోదరుల మృతి**

**గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాల వెలికితీత**

**హైదరాబాద్ కాచిగూడకు చెందిన అన్నదమ్ములుగా గుర్తింపు**

**నిర్మల్, జూన్ 9:** నిర్మల్ జిల్లా బాసరలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ మునిగి మృతిచెందారు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు మంగళవారం బాసరకు వచ్చారు. జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తుండగా ముగ్గురు సోదరులు ప్రమాదవశాత్తు లోతైన ప్రాంతంలోకి వెళ్లి నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది, గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. పలుగంటలపాటు సాగిన శోధన అనంతరం ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. మృతులను చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31)గా గుర్తించారు. వీరంతా సొంత అన్నదమ్ములేనని అధికారులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు ఒకేసారి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన బాసరతో పాటు హైదరాబాద్‌లోని కాచిగూడ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, గోదావరి నదిలో స్నానాలు చేసే సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మా పాలనకు మహిళలే స్ఫూర్తి

- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట..
- మహిళల దెబ్బకే కొందరు ఫామ్‌హౌస్‌కు పరిమితం
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- కేసీఆర్ హయాంలో మంత్రి పదవులూ దక్కలేదు
- బీజేపీ కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 553 ఆర్టీసీ బస్సులు మహిళా సంఘాలకు పంపిణీ



**హైదరాబాద్:** మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులను పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బస్సులను ప్రారంభించి మాట్లాడిన ఆయన, మహిళా శక్తి పథకం కింద ఈ బస్సులు అందజేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన పార్టీ కూడా కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని తమ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని, వారిని పాలనలో భాగస్వాములను



చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది సభ్యులు ఉన్నారని, మహిళలతో విరోధం పెట్టుకున్నవారు అధికారంలో నిలవలేరని వ్యాఖ్యానించారు. మహిళల మద్దతుతోనే తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, వారి తీర్పుతోనే కొందరు ఫామ్‌హౌస్‌లకే పరిమితమయ్యారని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి విమర్శించారు. కేసీఆర్ పాలనలో తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఇవ్వలేదని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి, తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. బీజేపీ కూడా ఇప్పటివరకు ఒక మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల బాలికల డ్రాపౌట్ రేటు తగ్గిందని, ఈ పథకం కోసం రూ.10,500 కోట్లు ఆర్టీసీకి చెల్లించామని తెలిపారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం రూ.60 వేల కోట్ల రుణాలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మహిళా శక్తి భవనాలను నిర్మించనున్నట్లు వెల్లడించిన సీఎం, హైటెక్ సిటీ సమీపంలో మహిళల కోసం రూ.1,000 కోట్ల విలువైన భూమిని కేటాయించామని తెలిపారు. 106 స్టాళ్లతో అంతర్జాతీయ ప్రమాణాల మాల్‌ను కూడా నిర్మించినట్లు పేర్కొన్నారు. పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ యూనిట్లు, పాఠశాలల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం సరఫరా వంటి బాధ్యతలను మహిళలకే అప్పగిస్తున్నామని చెప్పారు. అంబానీ, ఆదానీలకు పోటీగా మహిళలు వ్యాపార రంగంలో ఎదుగుతున్నారని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట ఉంటుందని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను గత ప్రభుత్వం చెల్లించలేదని ఆరోపించారు. మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన నాయకురాలు ఇందిరా గాంధీ అని పేర్కొన్న సీఎం, మహిళల అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని అన్నారు. 2034 వరకు ప్రజాపాలన కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తూ, మహిళల అండతో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు.

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

- 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనాలని మరోసారి లేఖ
- 8 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసిన రాష్ట్రం
- ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 9:** తెలంగాణలో ఉత్పత్తి అయిన ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో పండిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటివరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మరో రెండు లక్షల టన్నులు వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంకా పంట కోతలు కొనసాగుతున్నాయని చెప్పారు. రైతులు, మహిళా సంఘాల ఖాతాల్లో నేరుగా ఆన్‌లైన్ ద్వారా నగదు జమ చేస్తున్నామని, మహిళా సంఘాలకు రూ.170 కోట్లకు పైగా చెల్లించామని వెల్లడించారు. ఈ యాసంగిలో 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేశామని, క్వింటాలుకు వచ్చిన రూ.1,000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా బాధ్యతాయుతంగా కొనుగోళ్లు చేయలేదని పేర్కొన్నారు. రబీ, ఖరీఫ్ సీజన్లు కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, రైతుల ఖాతాల్లో రూ.35,077 కోట్లు జమ చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా సేకరణ చేపట్టామన్నారు. కేంద్రం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం నిర్దేశిస్తే, తెలంగాణ ఇప్పటికే 75 లక్షల టన్నులు కొనుగోలు చేసిందని చెప్పారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.171 కోట్లు చెల్లించామని, పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని విమర్శించిన ఉత్తమ్, దేశంలోని ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ తెలంగాణ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరగలేదన్నారు. ధాన్యం అంశంపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లకు పైగా కలిసి మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరినా కేంద్రం స్పందించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో హమాలీల కొరత, నిల్వ సామర్థ్య సమస్యలు ఉన్నప్పటికీ కొనుగోళ్లను సమర్థంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధునిక గిడ్డంగులు, నిల్వ వ్యవస్థల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మేడిగడ్డ అంశంపై మాట్లాడుతూ, మూడు బ్యారేజీల టెస్టింగ్ ప్రక్రియపై బుధవారం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇప్పటికే మేడిగడ్డలో నీళ్లు నిల్వ చేయవద్దని సూచించిందని, నీళ్లు నింపితే నిర్మాణానికి ప్రమాదం ఉందని స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ల

# రూ.వంద కోట్లకు పైగా!

- మోహన్ నాయక్‌కు భారీగా అక్రమ ఆస్తులు
- ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ ఇంట్లో ఏసీబీ దాడులు
- అరవై లక్షల నగదు, కిలో బంగారం స్వాధీనం
- ఏకకాలంలో 15 చోట్ల అధికారుల సోదాలు





**హైదరాబాద్:** రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) అధికారి, ఈఎన్సీ మోహన్ నాయక్ ఇంట్లో ఏసీబీ జరిపిన సోదాల్లో వంద కోట్లకు పైగా విలువైన అక్రమ ఆస్తులు బయటపడటం సంచలనం సృష్టిస్తోంది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయన ఇల్లు, కార్యాలయాలతో పాటు ఏకకాలంలో పదిహేను చోట్ల అధికారులు దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ నివాసం, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆయన ఆస్తుల విలువ వంద కోట్లకు పైగానే ఉంటుందని ఏసీబీ ప్రాథమికంగా అంచనా వేస్తోంది. వందల కోట్ల అక్రమ ఆస్తులు ఉన్నాయన్న పక్కా సమాచారంతో హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో పదిహేను చోట్ల సోదాలు చేపట్టారు. ఆయన బంధువుల నివాసాలు, కార్యాలయాల్లోనూ ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. మియాపూర్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న విల్లాలో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోదాలు జరిగాయి. భద్రతా కారణాల దృష్ట్యా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. ఎర్రమంజిల్‌లోని ఆయన కార్యాలయంలోనూ అధికారులు పలు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రణీత్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున ఆస్తులు, నగదును గుర్తించారు. అరవై లక్షల రూపాయల నగదు, ఒక కిలో బంగారు నగలు, పదమూడు బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే హైదరాబాద్, నిజామాబాద్‌లలో పలు ఇళ్లు, స్థలాల పత్రాలతో పాటు ఇంట్లో ఇరవైకి పైగా విదేశీ మద్యం సీసాలను కూడా గుర్తించారు. గతంలో రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు మోహన్ నాయక్‌పై వచ్చాయి. కాంట్రాక్టర్లకు టెండర్లు అప్పగించే క్రమంలో అక్రమాలకు పాల్పడ్డారనే ఫిర్యాదుల ఆధారంగానే ఏసీబీ ఈ విచారణ చేపట్టింది. ఈ సోదాలు పూర్తయిన తర్వాత పట్టుబడిన ఆస్తుల నికర విలువపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

# అతలాకుతలం !

**మంగళవారం సాయంత్రం భారీ వర్షం**

**విద్యుత్ షాక్‌తో ఇరువురి మృతి**

**గచ్చిబౌలిలో చెరువును తలపించిన రోడ్లు!**

**హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో మంగళవారం ఆకస్మికంగా కురిసిన వర్షం నగర వాసులను ఇబ్బందుల పాలు చేసింది. విద్యానగర్, కాచిగూడ, గచ్చిబౌలి,ఐకియా సర్కిల్ తదితర ప్రాంతాలలో వర్షం మూలంగా భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. దింతో గంటల తరబడి ప్రజలు ట్రాఫిక్లో చిక్కుకోవాల్సి వచ్చింది. గచ్చిబౌలి ప్రాంతంలో మంగళవారం వర్షం భారీగా కురియడంతో రోడ్లు చెరువులను తలపించాయి.వాహన దారులు కాలువల పైనుండి ప్రయాణం చేయాల్సి వచ్చింది.చాల చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో ఇద్దరు యువకులు షార్ట్ సర్క్యూట్ వల్ల చనిపోయారు. ఎల్టీ ఏబీ కేబుల్ వర్షానికి జారీ వారి పైన పడటంతో మృతిచెందినట్టు అధికారులు తెలిపారు. జాఫర్ (25 )స్పాట్ లోనే చనిపోయాడు అబూ (16 )ఒవైసీ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్టు అధికారులు తెలిపారు. అనుకోకుండా కురిసిన వర్షం మూలంగా హైదెరాబాద్ లోని చాల ప్రాంతాల్లో భారీగానే వర్షం కురిసింది. దింతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాల చోట్ల గంటల తరబడి రోడ్లపైనే ఉండాలి వచ్చింది. కొన్ని ప్రాంతాలలో ఐతే ట్రాఫిక్ లో చిక్కుకొని జనం విలవిల్లాడారు. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. దాదాపు ప్రధాన కూడళ్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.

# 14 రకాల నిత్యావసరాలు రేషన్ షాపుల ద్వారా అందించాలి

- పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి అధోగతి
- ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
- సివిల్ సప్లైస్ కార్యాలయం ఎదుట ఐద్వా ధర్నా




**హైదరాబాద్, జూన్ 9:** పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లైస్ కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల నియంత్రణలో విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, విద్యా ఫీజులు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందన్నారు. ధరల పెరుగుదల కారణంగా కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.05 కోట్ల బీపీఎల్ రేషన్ కార్డులు ఉండగా, వాటి పరిధిలో 3.39 కోట్ల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి ఆరు కిలోల బియ్యం మాత్రమే అందిస్తున్నారని చెప్పారు. ప్రజల ఆహార భద్రత కోసం బియ్యంతో పాటు పప్పులు, వంటనూనెలు, చక్కెర, కారం, పసుపు, జీలకర్ర, పామాయిల్, కొబ్బరి నూనె, ఆవాలు, జొన్నలు, పల్లీలు, సబ్బులు తదితర 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో అనేక కుటుంబాలు పోషకాహారాన్ని తీసుకోలేకపోతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య పెరుగుతోందని మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పోషకాహారం అందక చిన్నారులు కూడా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, దేశవ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆశలత, కె. నాగలక్ష్మి, పి. శశికళ, వై. వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బట్టుపల్లి అనూరాధతో పాటు పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

# జోజిలా.. ఓ మహాద్భుతం!

- ప్రపంచంలోనే ఎత్తైన ద్విముఖ సొరంగం
- విజయవంతంగా బ్రేక్ త్రూ పూర్తి చేసిన మేఘా సంస్థ
- ఏడాది పొడవునా శ్రీనగర్, లడఖ్ మధ్య రవాణా
- చరిత్రలో నిలిచిపోయే రోజన్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**హైదరాబాద్:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో నిర్మిస్తున్న పొడవైన సింగిల్ ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగం 'జోజిలా టన్నెల్' తవ్వకం పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. అత్యంత క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల నడుమ మేఘా ఇంజనీరింగ్ సంస్థ తుది బ్రేక్ త్రూను పూర్తి చేసి హిమాలయాల చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సముద్ర మట్టానికి 11,578 అడుగుల ఎత్తులో 13.153 కిలోమీటర్ల పొడవైన జోజిలా సొరంగాన్ని నిర్మిస్తున్నారు. జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఎన్హెచ్ఐడీసీఎల్) తరఫున మేఘా ఇంజనీరింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టింది. బాల్తాల్ నుంచి మీనామార్గ్ వరకు ఉన్న ఈ సొరంగంలో రెండు వైపుల నుంచి చేపట్టిన తవ్వకాలను మంగళవారం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ బ్రేక్ త్రూ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, మేఘా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్ (ఎన్ఏటీఎం) అనే అత్యుత్తమ సాంకేతికతతో ఈ సొరంగాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే శ్రీనగర్, కార్గిల్, లేహ్ మార్గంలో ఏడాది పొడవునా రవాణా సౌకర్యం కలుగుతుంది. భారీ హిమపాతాల వల్ల శీతాకాలంలో రహదారి మూసుకుపోయే సమస్య ఇక ఉండదు. రవాణా సౌలభ్యం పెరగడం, సరిహద్దు ప్రాంతాల్లో కనెక్టివిటీ మెరుగుపడటంతో దేశ రక్షణ, పర్యాటకం, ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుంది. కోటి సేఫ్ మ్యాన్ అవర్స్ నిబంధనలను పాటిస్తూ కార్మికుల భద్రతలోనూ మేఘా సంస్థ రికార్డు నమోదు చేసింది. తవ్వకాలు పూర్తవడంతో ఇక లైనింగ్, ఎలక్ట్రో మెకానికల్ పనులు చేపట్టనున్నారు. భారతదేశ మౌలిక సదుపాయాల చరిత్రలో ఇది చారిత్రాత్మక రోజని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కొనియాడారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాక ఈ సొరంగం ప్రపంచ రికార్డు సృష్టిస్తుందన్నారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతల్లోనూ మేఘా సంస్థ, ఇంజనీర్లు, కార్మికులు ఎంతో కష్టపడి ఈ బ్రేక్ త్రూ పూర్తి చేశారని ప్రశంసించారు. లడఖ్, జమ్మూ కాశ్మీర్ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కల నేడు నిజమైందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంతోషం వ్యక్తం చేశారు. మెరుగైన రవాణాతో ఆ ప్రాంత రూపురేఖలు మారిపోతాయన్నారు. అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో అహర్నిశలు శ్రమించిన ఇంజనీర్లను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఓ ఏటీఎం!

- మూసీ పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కానప్పటికీ.. దాని పేరుతో పేదలు, సామాన్యుల ఇళ్లను కూల్చివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఒక ఏటీఎంలా మారిపోయిందని.. రెండున్నరేళ్ల రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో దీన్ దయాళ్ ప్రశిక్షణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భువనగిరి జిల్లా బీజేపీ కార్యకర్తల సమావేశంలో రాంచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ చేపడుతున్న మూసీ (గాంధీ సరోవర్) ప్రాజెక్టు పేరిట.. తమ జీవితకాల పొదుపుతో ఇళ్లు నిర్మించుకున్న పేదలు, మధ్యతరగతి వర్గాలు, మాజీ సైనికులను రోడ్డున పడేయడాన్ని తాము ఎంతమాత్రం అంగీకరించబోమన్నారు. బీజేపీ నాయకులు రాష్ట్రానికి ఏం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే ప్రశ్నిస్తున్నారని, అయితే ఈ రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు ఏం చేశారో ఆయన సమాధానం చెప్పాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు రాలేదని, ఉద్యోగులకు సమయానికి జీతాలు, పదవీ విరమణ పొందిన వారికి బకాయిలు ఇవ్వడం లేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, రైతు భరోసా సరిగ్గా అమలు కావడం లేదని మండిపడ్డారు. హామీల అమలులో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టి మరల్చేందుకే తమపై విమర్శలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికి వదిలేసిందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే అయినా.. ఆ బాధ్యత నుంచి తప్పించుకునేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కొనుగోలుకు సంబంధించిన రవాణా, గోదాం ఖర్చులన్నీ కేంద్ర ప్రభుత్వమే భరిస్తున్నా.. కేంద్రంపై ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. చివరి గింజ వరకు కొంటామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు రైతులను నిలువునా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. మెట్రో, ఎంఎంటీఎస్ లాంటి ప్రాజెక్టులకు కేంద్రం ఎప్పుడూ పూర్తి సహకారం అందిస్తోందని గుర్తుచేశారు. సామాన్య ఓబీసీ కుటుంబం నుంచి వచ్చిన నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రి కావడాన్ని కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. దేశాన్ని ఒకే కుటుంబం పాలించాలనే అహంకారంతో ఆ పార్టీ పనిచేస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీ బలం పెరుగుతుండటం చూసి భయపడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు.. తెరవెనుక ఒక్కటయ్యాయని ఆరోపించారు. జమిలి ఎన్నికలు, రిజర్వేషన్ల అంశాల్లో ఆ రెండు పార్టీలు ఒకే వైఖరితో ఉన్నాయని తెలిపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో పన్నెండేళ్లుగా దేశం సుపరిపాలన, అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని, 1984లో రెండు సీట్లతో మొదలైన బీజేపీ ప్రస్థానం నేడు చారిత్రాత్మక తీర్పును సాధించే స్థాయికి చేరిందని ఆయన కొనియాడారు.



# ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

## నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా

## సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్

**న్యూఢిల్లీ, జూన్ 9:** తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతో పాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# విధుల్లో చేరేదాకా పర్యవేక్షిస్తాం!

## నియామక పత్రాలు ఇచ్చి వదిలేయం

## మైనార్టీ యువత ఉపాధికి పెద్దపీట

## త్వరలో జిల్లాల్లోనూ జాబ్ మేళాలు: మంత్రి అజహరుద్దీన్

**హైదరాబాద్:** ఉద్యోగ మేళాలో ఎంపికైన యువతకు కేవలం నియామక పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకోబోమని, వారు విధుల్లో చేరే వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ స్పష్టం చేశారు. మైనార్టీ యువతకు ఉపాధి కల్పించడం తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన తేల్చిచెప్పారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మైనార్టీ సంక్షేమ శాఖ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలో మెగా ఉద్యోగ మేళా విజయవంతంగా ప్రారంభమైంది. హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి అజహరుద్దీన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మైనార్టీల సంక్షేమం కోసం అద్భుత ప్రగతి సాధ్యమైందని అజహరుద్దీన్ తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తూ సమాన అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు అనే తేడా లేకుండా అన్ని మైనార్టీ వర్గాల యువతకు వివక్ష లేకుండా ఉపాధి కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. త్వరలోనే నిజామాబాద్, ఇతర జిల్లాల్లోనూ ఉపాధి మేళాలు నిర్వహిస్తామని ప్రకటించారు. యువత వృత్తి నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మెగా ఉద్యోగ మేళాకు అనూహ్య స్పందన లభించింది. వాణిజ్య, ఐటీ, ఫార్మా, ఆరోగ్య సంరక్షణ, నిర్మాణ రంగాలకు చెందిన 60 ప్రముఖ సంస్థల ప్రతినిధులు, 20 శిక్షణా సంస్థలు హాజరయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల మంది మైనార్టీ యువతీయువకులు తరలివచ్చారు. ఉద్యోగ అవకాశాలతో పాటు కెరీర్ కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి కోర్సుల నమోదు సేవలను అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



చురకలు






# ట్రంప్‌కు వీసా దెబ్బ!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రయాపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# లోక్‌సభలో 2/3 మెజారిటీనే టార్గెట్

**డీలిమిటేషన్, రాజ్యాంగ బిల్లుల కోసం ఎన్డీయే వ్యూహాలు**

**కలిసిరానున్న టీఎంసీ, డీఎంకే రాజకీయ సంక్షోభం**

**2/3 మెజారిటీ సాధించే దిశగా బీజేపీ కూటమి..**



**న్యూఢిల్లీ, జూన్ 9:** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సంక్షోభం, బీజేపీకి వరంగా మారుతోంది. తన లక్ష్యాలను సాధించుకోవడానికి ఎన్డీయే సర్కార్ వేగంగా పావులు కదుపుతోంది. ముఖ్యంగా, బీజేపీ సర్కార్ కీలకంగా భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)ను ఆమోదింప చేసుకుని, 2029 ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని భావిస్తోంది. ఈ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో 2/3 వంతు మెజారిటీ అవసరం. ప్రస్తుతం, ఉన్న ఎన్డీయే బలం దీనికి సరిపోదు. అయితే, ఇప్పుడు టీఎంసీ పరిణామాలు ఎంతో కొంత బీజేపీకి సహకరించే అవకాశం ఉంది. టీఎంసీకి చెందిన 20 మంది లోక్‌సభ ఎంపీలు ఎన్డీయేకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇది మమతా బెనర్జీకి భారీ ఎదురుదెబ్బగా చెప్పవచ్చు. సోమవారం మమతా ఇండియా కూటమి సమావేశంలో ఉన్న సమయంలోనే, తిరుగుబాటు ఎంపీలు బీజేపీ నేతలు, బెంగాల్ సీఎం సువేందు అధికారితో భేటీ అయ్యారు. కకోలి ఘోష్ దస్తిదార్ నేతృత్వంలో టీఎంసీ ఎంపీలు ఇప్పటికే ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ 20 మంది ఎంపీల మద్దతు లభిస్తే, లోక్‌సభలో ఎన్డీయే బలం 300 మార్కును దాటే అవకాశం ఉంది. మరోవైపు, డీఎంకే మద్దతు కోసం బీజేపీ తెరవెనక ప్రయత్నాలు చేస్తోంది. డీఎంకేకు లోక్‌సభలో 22 మంది ఎంపీలు ఉన్నారు. అంశాల వారీగా మద్దతు ఇస్తే ఎన్డీయే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే, కాంగ్రెస్ విజయ్ టీవీకే పార్టీకి మద్దతు ఇవ్వడంతో డీఎంకే-కాంగ్రెస్ మధ్య బంధం విడిపోయింది. ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలు ఉంటే, మూడు ఖాళీలు ఉన్నాయి. దీంతో సభ్యుల సంఖ్య 540కి చేరింది. ఎన్డీయే బలం 293, టీఎంసీ తిరుగుబాటు ఎంపీలు 20 మంది కలిస్తే 313కు చేరుతుంది. డీఎంకే మద్దతు సంపాదిస్తే 335కు చేరుతుంది. శివసేన ఉద్ధవ్ వర్గానికి 9 మంది ఎంపీలు ఉన్నారు. వీరు చీలిపోతే ఆరుగురు ఎంపీలు ఎన్డీయే వైపు వస్తారు. దీంతో సంఖ్య 341కి చేరుతుంది. మూడింట రెండొంతులు(2/3) మెజారిటీ మార్క్ 362. మరో 12 సీట్ల దూరంలో ఎన్డీయే నిలిచిపోతుంది. చిన్న పార్టీలు, క్రాస్ ఓటింగ్ సాధ్యమైతే ఎన్డీయే మెజారిటీ సాధిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి వీలవుతుంది. మరోవైపు రాజ్యసభలో ఎన్డీయే మూడింట రెండొంతుల మెజారిటీకి చేరువైంది. తృణమూల్ కు చెందిన 13 రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఇందులో చాలా మంది బీజేపీ వైపు వచ్చే ఛాన్స్ ఉంది. రాజ్యసభలో ఇప్పటికే ఎన్డీయేకు 150 సీట్లు ఉన్నాయి. డీఎంకే షరతులతో కూడిన మద్దతు ఇచ్చే ఛాన్స్ ఉంది. మూడింట రెండొంతుల మెజారిటీ మార్క్ 164 కాగా, ఈ సంఖ్యను ఈజీగానే ఎన్డీయే సాధించే అవకాశం ఉంది. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ కోసం వ్యూహాలు:

2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన కోసం రాజ్యాంగ సవరణ బిల్లు అవసరం అవుతుంది. 2026లో తొలి ప్రయత్నంగా డీలిమిటేషన్ బిల్లును ఎన్డీయే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోవడంతో ఈ బిల్లు ఓడిపోయింది. ఈసారి వర్షాకాల సమావేశాల్లో బీజేపీ ఈ బిల్లును మళ్లీ తీసుకురావాలని భావిస్తోంది. దీని కోసం వేగంగా పావులు కదుపుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్, డీలిమిటేషన్ ప్రక్రియ, వన్ నేషన్-వన్ ఎలక్షన్ వంటి వాటికి ఆమోదం సాధించే లక్ష్యంగా ఎన్డీయే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

# ఐరాసలో పాక్‌కు భారత్ హెచ్చరిక

**పాక్ చర్యల ఖండన**

**ఆఫ్ఘనిస్థాన్‌కు మద్దతు ప్రకటన**

**పౌరుల రక్షణపై దృష్టి**



ఆఫ్ఘనిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ విడుదల చేసిన నివేదికలను హరీశ్ పర్వతనేని ప్రస్తావించారు.

**న్యూయార్క్, జూన్ 9:** ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఆఫ్ఘనిస్థాన్ భూభాగంపై పాకిస్థాన్ సైన్యం జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులు ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యలని, ప్రాంతీయ శాంతి భద్రతలకు ముప్పుగా మారుతున్నాయని భారత్ స్పష్టం చేసింది. ఐరాస సర్వసభ్య సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యంగా పౌర ప్రాంతాలపై జరిగే దాడులు అంతర్జాతీయ మానవతా సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. యుద్ధాలు, ఘర్షణల సమయంలో సాధారణ ప్రజల ప్రాణాలు కాపాడటం ప్రతి దేశం బాధ్యత అని భారత్ గుర్తుచేసింది. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే వందలాది మంది పౌరులు మరణించగా, మరెందరో గాయపడినట్లు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. పవిత్ర రంజాన్ మాసంలో జరిగిన దాడుల్లో అధిక సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోవడం మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. ఐరాస నివేదికల విశ్వసనీయతను పాకిస్థాన్ ప్రశ్నించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. అంతర్జాతీయ సంస్థలు రూపొందించిన నివేదికలను తమకు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే అంటకరించడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించింది. బహుళపక్ష వ్యవస్థలపై గౌరవం అంటే వాటి నిర్ణయాలు, నివేదికలను సమగ్రంగా పరిగణించడమేనని భారత్ స్పష్టం చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వం నెలకొల్పేందుకు ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ చేస్తున్న కృషికి భారత్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాలను ప్రతి దేశం గౌరవించాలని, ముఖ్యంగా మానవతా చట్టాలను కచ్చితంగా పాటించాలని భారత్ పునరుద్ఘాటించింది. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐరాస ప్రధాన కార్యదర్శి చేసిన పిలుపుకు కూడా భారత్ మద్దతు తెలిపింది. దాడులపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత్ కోరింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంది. హింస, వైమానిక దాడులు సమస్యలకు పరిష్కారం కాదని, సంభాషణలు, శాంతియుత మార్గాల ద్వారానే ప్రాంతీయ స్థిరత్వం సాధ్యమవుతుందని భారత్ ఐరాస వేదికగా స్పష్టం చేసింది.

## కాంగోను వణికిస్తున్న ఎబోలా

**ఇప్పటికే 101 మంది మృత్యువాత**



**న్యూఢిల్లీ, జూన్ 9:** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. 19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కివులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్‌కు సరైన టీకా, చికిత్స లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.

## హెచ్1బీ వీసాపై ట్రంప్‌కు షాక్

**లక్ష డాలర్ల ఫీజుపై కోర్టు కొట్టివేత**




**వాషింగ్టన్, జూన్ 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని, చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

## గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతి

- మలక్కా జలసంధికి అతిసమీపంలో జీఎన్ఐ ప్రాజెక్టు

**న్యూఢిల్లీ, జూన్ 9:** గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చింది. రూ. 13వేల కోట్లతో పౌర-సైనిక విమానాశ్రయాన్ని నిర్మించనుంది. ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఇప్పటికే ఉన్న నావికాదళ విమానాశ్రయాన్ని విస్తరించే ఆలోచనను పక్కనపెట్టింది. పర్యావరణపరంగా వైవిధ్యమైన ద్వీపంలో రూ. 81వేల కోట్లతో ప్రకటించిన గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం గమనార్హం. పౌర, సైనిక అవసరాలు తీరేలా గలాథియా బే సమీపంలోని చింగెన్ వద్ద ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. భౌగోళిక పరిమితుల వల్ల ఇప్పటికే ఉన్న ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్‌స్టేషన్ వద్ద రన్‌వేను విస్తరించేందుకు దీర్ఘకాలికంగా ఉన్న ప్రణాళికను పక్కనపెట్టాల్సి వచ్చింది. రానున్న ఐదేళ్లలో దీని నిర్మాణం పూర్తికావొచ్చని సమాచారం. నికోబార్ దీవి మలక్కా జలసంధికి అతిసమీపంలో ఉండటంతో జీఎన్ఐ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని రక్షణరంగ వర్గాలు వివరించాయి. జలసంధికి సమీపంలోనే యుద్ధ నౌకలు, వైమానిక సదుపాయాలు ఉండటం నిఘాకు ఎంతో కీలకం కానుందన్నాయి. చైనాకు చెందిన 80 శాతం చమురు, 70 శాతం సహజవాయువు మలక్కా జలసంధి మీదుగా రవాణా అవుతుందని వెల్లడించాయి. రూ. 81వేల కోట్ల గ్రేట్ నికోబార్ ఐలాండ్ (ఉఔఎ) డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద తలపెట్టిన మౌలిక సదుపాయాల్లో ఎయిర్‌పోర్ట్ ఒకటి. అండమాన్ నికోబార్ ఐలాండ్‌ను ఆర్థిక, వ్యూహాత్మక హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్రం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకుతీసుకువచ్చింది. ఈ ప్రాజెక్టును విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇది దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 160 చదరపు కిలోమీటర్ల మేర లక్షల చెట్లను నరికివేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసమని మండిపడ్డారు.



# బడిబాట కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని

**జహీరాబాద్, జూన్ 9 :**




జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కొత్తూర్ మంగళవారం రోజు ప్రో. జయశంకర్ బడిబాట కార్యక్రమం బాగంగా కొత్తూర్ (బి) గ్రామంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి . ప్రియదర్శిని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి మనేమ్మ గారు, గ్రామ సర్పంచ్ మహదేవి మల్లికార్జున్ గారు ఉప సర్పంచ్ మోసిన్ గారు మాట్లాడుతూ నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ఇక్కడ పౌష్టిక భోజనం, విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు కరాటే క్లాసులు,IFB పానెల్ ద్వారా విద్యాబోధన, కంప్యూటర్ ల్యాబ్ మొదలైన సౌకర్యాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తూరు బి పాఠశాలలో ఉన్నాయి కనుక విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరడం జరిగింది కార్యక్రమంలో ఉపాధ్యాయులు వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి





- కలెక్టర్, డీఈవోలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి

**చురకలు విలేఖరి, హైదరాబాద్, జూన్ 09:**

హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నారని,ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, పి. సంతోష్ కుమార్, అడ్వయిజర్ గోవింద్ నాయక్, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి(డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య**

**నారాయణపేట,09:**



నారాయణపేట జిల్లా: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై సంచరిస్తున్న 12 వాహనాలను గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు వెంటనే నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ... వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. వాహనాల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల విచారణ వంటి అంశాల్లో నెంబర్ ప్లేట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కొంతమంది వాహనదారులు నిబంధనలను పట్టించుకోకుండా నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్నారని, అలాంటి వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోతే దొంగతనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు గుర్తించడం కష్టమవుతుందని, అందువల్ల ప్రతి వాహన యజమాని తప్పనిసరిగా నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు:డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు.* ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.* కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి.* మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధం.* రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేయరాదు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదు. ఆటోలలో అనుమతించిన సీట్ల సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించరాదు.* పాఠశాల విద్యార్థులను, కూలీలను ఆటోలలో అధిక సంఖ్యలో తీసుకెళ్లరాదు.* డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదు.* రేసింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్ చేయరాదు.* నిర్ణీత వేగ పరిమితులను పాటిస్తూ వాహనాలు నడపాలి.* ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచికలను తప్పనిసరిగా అనుసరించాలి. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసు శాఖకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య కోరారు.

# విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి: అడిషనల్ ఎస్పీ రమేష్

**నల్లగొండ , జూన్ 9 :**



విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని నల్లగొండ జిల్లా అడిషనల్ ఎస్పీ రమేష్ గారు సూచించారు మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని లయన్స్ భవన్ లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభకు పురస్కారం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే సరైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యాన్ని సాధించేందుకు అనుక్షణం తపిస్తూ చదవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని 33 మండలాల్లో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థులకు మోమెంటో, శాలువా సన్మానం, సర్టిఫికెట్ అదేవిధంగా 1000 క్యాష్ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నేషనల్ ట్రెజరర్ నూనె సుదర్శన్ గారు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివి తల్లిదండ్రులకు, మీ పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని అదేవిధంగా ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అనుక్షణం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్ ప్రెసిడెంట్ కోట సరిత, నేషనల్ డైరెక్టర్ కోట్ల సాయికిరణ్, రీజియన్ సెక్రటరీ గూడూరు అంజిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ నారాయణ కవిత, రవీంద్ర చారి, మాధవి, బాలు, నాగేశ్వరావు, లక్ష్మణ్, సరస్వతి, భీష్మాచార్య, విజయ్, భాస్కరరావు, గోపాల్ రావు, వెంకటేశ్వరరావు, సమీర్ బాబా, సురేష్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు విజయలక్ష్మి మాతృ శక్తి శ్రీమంత కానుక

- కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఫౌండేషన్ చేర్మెన్ విజయక్క
- దేవనూర్ సర్పంచ్ రేణుక కిషన్ రావు

**యాలాల మండలం, జూన్,09:**



మండలం పరిధిలోని దేవనూర్ గ్రామంలో కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు "విజయలక్ష్మి మాతృ శక్తి శ్రీమంత కానుక పేరుతో కిట్టు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గడపకు చేరుకుని గర్భిణీ స్త్రీలకు చీరలు,సారెలు అవసరమైన వస్తువులతో కూడిన కానుకలను సోదరీభావంతో అందజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి కంజర్ల విజయలక్ష్మి యాదవ్ పాల్గొని గర్భిణీ స్త్రీలకు సీమంత కానుక అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భిణీ స్త్రీల ఆరోగ్యం,శిశు సంక్షేమం ప్రతి కుటుంబానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు అవసరమైన సహాయం అందించేందుకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని దేవనూర్ సర్పంచ్ రేణుక కిషన్ రావు, వికారాబాద్ జిల్లా మాజీ కోఆప్షన్ మెంబర్ అక్బర్ బాబా,మాజీ ఎంపిటీసీ మంత్రి వెంకటయ్య, వార్డు సభ్యులు ,మెట్లీ కృష్ణ స్థానిక మహిళలు గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో దేవనూర్ గ్రామ పెద్దలు,ఆశ కార్యకర్తలు సభ్యులు,అంగన్వాడి టీచర్ ఫౌండేషన్ క్రాంతి అనిల్ కుమార్ గౌడ్ ప్రకాష్ గౌడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇళ్లపై ఏసీబీ సోదాలు



**హైదరాబాద్ జూన్9 :**



తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జే. మోహన్ నాయక్‌కు సంబంధించిన ఆస్తులపై ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. మాదాపూర్‌లోని నివాసం సహా మొత్తం 11 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. రోడ్లు, భవన నిర్మాణ కాంట్రాక్టుల కేటాయింపులో అక్రమాలు, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు వసూలు చేశారన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. భారీగా స్థిర, చర ఆస్తులు ఉన్నట్లు అనుమానిస్తున్న అధికారులు వాటి వివరాలను సేకరిస్తున్నారు. సోదాలు సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉందని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. మోహన్ నాయక్ ప్రస్తుతం తెలంగాణ ఆర్అండ్‌బీ శాఖలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా ఉన్నారు.

# మోదీ నాయకత్వంలో సంక్షేమం–అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాయి: అమిత్ షా

**న్యూఢిల్లీ, జూన్ 9 :**



ప్రధాని నరేంద్ర మోడి నాయకత్వంలో గత 12 ఏళ్లలో దేశం సంక్షేమం, మౌలిక వసతులు, సామాజిక భద్రత, ఆర్థికాభివృద్ధి రంగాల్లో విశేష పురోగతి సాధించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజును పురస్కరించుకుని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. దేశంలో తొలిసారిగా పేదల సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాయని పేర్కొన్నారు. 80 కోట్ల మందికి ఉచిత రేషన్, 4 కోట్లకుపైగా పక్కా ఇళ్లు, 50 కోట్ల మందికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా, 10 కోట్ల కుటుంబాలకు ఎల్పీజీ కనెక్షన్లు అందించామని తెలిపారు. అలాగే 90కిపైగా విమానాశ్రయాలు, 140కుపైగా వందే భారత్ రైళ్లు, 1.45 లక్షల కిలోమీటర్ల రహదారులు, 3 వేల కిలోమీటర్లకు పైగా ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మించామని పేర్కొన్నారు. దేశాన్ని ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిపిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందని అమిత్ షా అన్నారు. జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా, సంపూర్ణ అంకితభావంతో పనిచేసే నాయకత్వం వల్లే ఈ మార్పు సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు..

# ప్రతి పాఠశాలలో 10 శాతం ప్రవేశాల పెంపు లక్ష్యంగా పని చేయాలి: కలెక్టర్

**ములుగు, జూన్ 9:**



జిల్లాలోని ప్రతి పాఠశాలలో కనీసం 10 శాతం విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. జీరో విద్యార్థులున్న పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచాలని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పారిశుధ్యం తదితర సౌకర్యాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. చిన్నబోయినపల్లి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 12 నుంచి 120 మందికి పెంచిన కానిస్టేబుల్ ధూపాటి సతీష్, గ్రామ సర్పంచ్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, జూన్ 9:**

బడి బాట కార్యక్రమంలో భాగంగా రామారెడ్డి మండలంలోని ఎస్సీ కాలనీలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం పర్యటించి ఇంటింటి ప్రచారాన్ని పరిశీలించారు. పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

చురకలు



## ఎఫ్ఎల్ఎన్ అమలులో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలదే కీలక పాత్ర

### కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్, జూన్ 9:**

జిల్లాలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ఫలితాల మెరుగుదల కోసం నిర్వహించిన జిల్లా వార్షిక ప్రణాళిక వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. బేస్‌లైన్ అసెస్‌మెంట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల తనిఖీలు, విద్యార్థుల పురోగతి పర్యవేక్షణ, ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు ఆదేశించారు. ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య అందించడంలో ఎఫ్ఎల్ఎన్ కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.

## మెదక్ జిల్లాను విద్యలో అగ్రస్థానంలో నిలపాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జూన్ 9:**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే కేరాఫ్ అడ్రస్ అని, విద్యారంగంలో మెదక్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ద్వారానే వ్యక్తి ఉన్నత స్థాయికి చేరుకోగలడని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం ఐఐఐటీలకే పరిమితం కాకుండా, ఐఐటీలు, ఎయిమ్స్ వంటి దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశాలు సాధించే లక్ష్యంతో కృషి చేయాలని సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, అలాగే ఎస్ఎస్సీ పరీక్షల్లో 560కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రశంసాపత్రాలు, ఎగ్జిక్యూటివ్ ఫైల్, డిక్షనరీ, పెన్నులతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏఎంఓ సుదర్శనమూర్తి, కరుణాకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు, సహాయ గణాంక అధికారి నవీన్, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్పీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేదు: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, జూన్ 09:**

జిల్లాలో యూరియా నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం ఎడపల్లి మండలంలోని జానకంపేట్, ఎడపల్లి ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ప్రతి స్టాక్ పాయింట్‌లో యూరియా అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నామని, బుకింగ్ యాప్ ద్వారా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 27 వేల మెట్రిక్ టన్నులకుపైగా యూరియా నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, అయితే కొనుగోలుకు బలవంతం చేయరాదని డీలర్లను హెచ్చరించారు. రైతులు అవసరానికి మించి ఎరువులు, పురుగుమందులు వాడకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కలెక్టర్ కోరారు.

## ఎస్ఐఆర్-2002 ఓటర్ల మ్యాపింగ్ ను విజయవంతం చేయాలి: కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, జూన్ 9:.**



ఎస్ఐఆర్–2002 ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన స్వయంగా తన ఓటును ఎస్ఐఆర్–2002 ఎలక్టోరల్ రోల్‌కు మ్యాపింగ్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా పాత ఓటరు వివరాలను సులభంగా సేకరించి బీఎల్ఓ యాప్‌లో మ్యాపింగ్ పూర్తి చేయవచ్చన్నారు. ఓటర్ల మ్యాపింగ్‌కు జూన్ 24 వరకు గడువు ఉందని, జూన్ 25 నుంచి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేపడతారని తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం, మావల ప్రాంత ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ యజ్వేందర్, బీఎల్ఓ నివేదిత తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో సుచిత్ర అకాడమీ జోడీకి స్వర్ణం

**హైదరాబాద్, క్రీడా ప్రతినిధి, జూన్ 9:**



గచ్చిబౌలిలో నిర్వహించిన యోనెక్స్-సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్–15) జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన కిమ్‌కిమ్ ఖోంగ్‌సాయ్, లియాన్‌సాంగ్‌పుయా జోడీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ జంట టోర్నీ అంతటా అద్భుత ఆటతీరుతో ఆకట్టుకుని జాతీయ ర్యాంకింగ్ ఛాంపియన్లుగా నిలిచింది. సెమీఫైనల్లో రెండో సీడ్ జోడీపై ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసిన కిమ్‌కిమ్–లియాన్‌సాంగ్‌పుయా జంట, ఫైనల్లో 21–10, 21–15 స్కోరుతో ప్రత్యర్థులను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ ఇద్దరు క్రీడాకారుల ప్రతిభను రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందకముందే సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ కె. ప్రదీప్ రాజు గుర్తించారు. మణిపూర్‌కు చెందిన ఈ క్రీడాకారులను అకాడమీలోకి తీసుకువచ్చి ఉన్నత స్థాయి శిక్షణ, విద్యా సహాయం, వసతి, ఫిట్‌నెస్, జాతీయ స్థాయి పోటీల అనుభవం వంటి అవకాశాలు కల్పించారు. ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను చిన్న వయసులోనే గుర్తించి వారికి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రొఫెషనల్ మార్గదర్శకత్వం అందించాలనే లక్ష్యంతో ప్రదీప్ రాజు నిరంతరం కృషి చేస్తున్నారు. కిమ్‌కిమ్, లియాన్‌సాంగ్‌పుయాల విజయం ఆయన దీర్ఘకాలిక క్రీడాకారుల అభివృద్ధి ప్రణాళికకు నిదర్శనంగా నిలిచింది. ప్రస్తుతం దేశంలోని ప్రముఖ బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రాల్లో ఒకటిగా ఎదిగిన సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దుతూ కొత్త తరం ఛాంపియన్లను తయారు చేస్తోంది. కిమ్‌కిమ్, లియాన్‌సాంగ్‌పుయాల స్వర్ణ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ, సరైన సమయంలో గుర్తించిన ప్రతిభకు తగిన ప్రోత్సాహం లభిస్తే అసాధారణ విజయాలు సాధించవచ్చనే విషయాన్ని మరోసారి రుజువు చేసింది.

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

- **ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.**

**నారాయణపేట,09:**

మంగళ వారం జిల్లా కలెక్టర్ ప్రియాంక జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు గుర్తింపు పొందిన



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ జయ సుధ,తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అన్నమయ్య సంకీర్తన వైభవాన్ని చాటిన 'సద్గురు సమీరమ్'

**హైదరాబాద్, జూన్ 9 ::**



హైందవ ధర్మ కీర్తిని కొనియాడుతూ, సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా శ్రీ శక్తీ సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో సద్గురు అన్నమయ్య శిష్య, భక్త బృందం నిర్వహించిన 'సద్గురు సమీరమ్' సాంస్కృతిక కార్యక్రమం శిల్పకళావేదిక ఎతనిక్ హాల్‌లో భక్తి, సంగీత, నృత్య వైభవాల నడుమ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో చిన్నారి కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్య రూపకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. వీణా సమ్మేళనం సంగీతాభిమానులను చల్లని రాగ సమీరాల మధ్య విహరింపజేసింది. నగరానికి చెందిన సుమారు 30 మంది ప్రముఖ నాట్యాచార్యులు విశిష్ట అతిథులుగా హాజరుకాగా, శ్రీ శక్తీ సేవా సత్సంగ్ నిర్వాహకురాలు శ్రీమతి మీనాక్షి శ్రీనివాసు వారిని ఘనంగా సత్కరించి గురుపరంపర వైశిష్ట్యాన్ని వివరించారు. గత మూడు సంవత్సరాలుగా అన్నమయ్య సేవలో భాగంగా దేశంలోని కాశీ, అయోధ్య, కంచి, అరుణాచలం, ఘాటీ, ఉడుపి శ్రీకృష్ణ మఠం, యాగంటి, మహానంది, కాణిపాకం, తాళ్లపాక, పుష్పగిరి, లేపాక్షి, శ్రీకూర్మం, విజయవాడ, రాజమండ్రి, ర్యాలీ, అప్పనపల్లి, సింహాచలం, అరసవిల్లి, కొండగట్టు, రేచింతల్, అమ్మపల్లి, యాదాద్రి, శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాలలో సుమారు పది వేల మందికి పైగా కళాకారులతో అన్నమయ్య సంకీర్తన సేవలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంకీర్తన సామ్రాట్, సప్తస్వర వైతాళికుడు, అన్నమయ్య 12వ తరపు వారసులైన శ్రీమాన్ శ్రీ శ్రీ శ్రీ తాళ్లపాక స్వామిజీ ఆశీస్సులను నిర్వాహకులు స్మరించారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీలంక రామాయణ యాత్రలో అన్నమయ్య సంకీర్తన ప్రచార వైభవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సద్గురు సమీరమ్ కార్యక్రమంలో నాట్యాచార్యులు శ్రీమతి జోషి గోపాలాచార్య శిష్యబృందం, శ్రీమతి మలిశెట్టి అనూష నాయుడు బృందం, కుమారి కృష్ణశ్రీ శర్మ, కుమారి లావణ్యశ్రీ బృందాలు నృత్య ప్రదర్శనలు ఇవ్వగా, శ్రీమతి కళ్యాణి హేమలత బృందం వీణానాదంతో అలరించింది. కార్యక్రమానికి శ్రీ కట్ట నర్సింగ్ కన్వీనర్‌గా వ్యవహరించగా, కమిటీ సభ్యులు శ్రీ పృథ్వీరాజ్, శ్రీ రాఘవేంద్ర, శ్రీమతి నీరజ, శ్రీమతి శ్రీదేవి సమన్వయకర్తలుగా సేవలందించారు.

## పొంచి ఉన్న ప్రమాదం..

### ఒరిగిన విద్యుత్ స్తంభం.

**రాయపోల్, జూన్ 9:**

రాయపోల్ మండల పరిధిలోని ఆరేపల్లి నుంచి ముంగాజిపల్లి వెళ్లే బీటీ రహదారి పక్కన ఆరేపల్లి శివారులోని కొంపల్లి అయ్యేల్లం వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. స్తంభం పూర్తిగా ఒకవైపు వంగిపోవడంతో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒరిగిన స్తంభం కూలితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గాలులు, వర్షాల కారణంగా పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఒరిగిన స్తంభాన్ని వెంటనే సరిచేసి ప్రమాదాన్ని నివారించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.



## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- **పలు మండలలో పర్యటించి**
- **చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పరిశీలన**

**మంచిర్యాల జిల్లా, జూన్ 9:**



ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్‌లో పట్టణ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బెల్లంపల్లి, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి భోజనశాలలు, అదనపు గదులు, ప్రహరీ గోడల నిర్మాణ పనులను పరిశీలించారు. కన్నెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

చురకలు



# రైతులకు నాణ్యమైన విత్తనాలనే అందించాలి

- ఎరువులు, విత్తనాలపై అధిక ధరలు వసూలు చేయరాదు:
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**నిర్మల్ జూన్9:**

రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.

సోమవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని బాలకిషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువులు విత్తనాల స్టాక్, క్రయ విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్ లలోని వివరాలను ఆన్లైన్ వివరాలతో సరిపోల్చారు. క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులన్నీ పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో తేడాలు ఉండరాదన్నారు. పలు కంపెనీల విత్తనాల లేబుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలను అమ్మరాదని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని అన్నారు. రైతుల నుంచి విత్తనాలు, ఎరువులకు నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదని చెప్పారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీవి అమ్మినా, అధిక ధరకు అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందివ్వాలని అన్నారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, తహసిల్దార్ సంతోష్, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హైదలాపూర్ గ్రామంలో ఘనంగా "ఖేత్ బచావో" కార్యక్రమం

**సంగారెడ్డి జిల్లా , జూన్ 9**



మునిపల్లి మండల పరిధిలోని హైదలాపూర్ గ్రామంలో రైతులకు వ్యవసాయ రంగంలో అవగాహన కల్పించేందుకు "ఖేత్ బచావో" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంటలను చీడపీడలు, తెగుళ్ల నుంచి రక్షించడం, సమగ్ర పంట నిర్వహణ (Integrated Crop Management), సమగ్ర పురుగుల నిర్వహణ (IPM), నేల ఆరోగ్య పరిరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు మరియు రైతుల ఆదాయాన్ని పెంచే ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డా. విజయ్ అవినాశిలింగం, N.A. Team Leader, Group-IV, MGMG Principal Scientist, XSM, ICAR-NAARM మరియు డా. సోనా యెంగ్‌కోక్‌పామ్, Principal Scientist (HRM Division), ICAR-NAARM పాల్గొన్నారు. వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, పంటల సంరక్షణలో శాస్త్రీయ

విధానాల ప్రాధాన్యత, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల అవసరాన్ని వివరించారు.అనంతరం కేవీకే శాస్త్రవేత్తలు శ్రీమతి స్నేహ (ఎంటమాలజీ), శ్రీ స్వామి, వ్యవసాయ అధికారి శ్రీమతి అనిత, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీమతి నిఖిత, శ్రీ రహమాన్ పాల్గొని రైతులకు పంటల నిర్వహణ, చీడపీడల నివారణ, నేల ఆరోగ్య సంరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం తదితర అంశాలపై విలువైన సూచనలు అందించారు ఈ సందర్భంగా రైతులు పంటల సంరక్షణకు సంబంధించిన పలు సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని రైతులు అభిప్రాయపడ్డారు.

# పరస్పర అంగీకారం ద్వారా పెండింగ్లో ఉన్న కేసులు కొట్టివేత..

**జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్....**



**నారాయణపేట, జూన్,09:**

నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశించి సీనియర్ సివిల్ జడ్జి మరియు లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్ మాట్లాడుతూ...రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని న్యాయమూర్తి తెలిపారు. మే 9న జరగాల్సిన లోక్ అదాలత్ జూన్ 20న జరుగనుంది అన్నారు. తదుపరి నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను గురించి ఆరాధించారు . వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు నారాయణపేట టౌన్ మరియు రూలర్, మాగనూరు, మద్దూరు, దామరగిద్ద, ఉట్కూర్, కోస్గి, ధన్వాడ, మక్తల్, కృష్ణ, నర్వ, మరియు మరికల్, ఎక్సైజ్ ఇతర స్టేషన్ లలో ఈపెట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెండింగ్లో ఉన్నాయని టార్గెట్ గా ఉన్నాయని తెలిపారు. ఎక్సయిజ్ శాఖలో పెండింగ్ కేసులు ఉన్నాయా క్లియర్ చేయాలన్నారు. అన్ని కలిపి 6500 కేసులను టార్గెట్ గా అయన నిర్దేశించారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏజెండా లోని అంశాలు UTPs, చార్జిషీట్, సైబర్ క్రైమ్స్ గురించి చర్చించారు, ముందుగా గౌరవనీయులైన హై కోర్ట్ జడ్జే ఆదేశానుసారం ముందుగా జైలు లో ఉన్న ఖైదీల కేసులను డిస్పోసల్ చెయ్యాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ చర్ప్ బి మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్ లో పోలీసులందరూ సహకరించి జాతీయ ఉపయోగించుకొని రాజి మార్గం ద్వారా కేసులని తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు.ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మరియు సెక్రటరీ డిఎల్ఎస్ఏ వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీ బి మనోజ్, జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీ అవినాష్ మరియు డిఫెన్స్ కౌన్సిల్స్ కె లక్ష్మి పతి గౌడ్, మరియు పోలీస్ అధికారులు, కోర్ట్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు

- నూతన కార్యదర్శికి ఆత్మీయ స్వాగతం పలికిన తండావాసులు
- గ్రామ అభివృద్ధికి శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయం-

**బొంరస్ పేట మండలం, జూన్,09**

వికారాబాద్ జిల్లా బొంరస్ పేట మండల పరిధిలోని టేకులగడ్డ తాండ గ్రామపంచాయతీలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన కార్యదర్శి శ్రీనివాస్ ను తండావాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జి శ్రీనివాస్ కార్యదర్శికి ఆత్మీయ స్వాగతం తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ ప్రథమ పౌరురాలు లక్ష్మీరాజు తదితరులు మాట్లాడుతూ, గ్రామ ప్రజలతో కలిసి పనిచేసి మంచి సేవలు అందించిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నూతన కార్యదర్శి గ్రామ అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తండా నాయకులు రోమ్య, అంగన్వాడీ సిబ్బంది బుజ్జి భాయ్, రమేష్, విశాల్, పంచాయతీ సిబ్బంది సేవియా నాయక్,తండా పెద్దలు యువ నాయకులు పాల్గొన్నారు.



# ప్రి-ప్రైమరీ ప్రాథమిక పాఠశాలలకు బోధకులు, ఆయాల నియామకం



**రాయపోల్, జూన్ 9:**

రాయపోల్ మండలంలో నూతనంగా మంజూరైన ప్రీ ప్రైమరీ ప్రాథమిక పాఠశాలలను ఈ విద్యా సంవత్సరంనుంచి ప్రారంభించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రాజగోపాల్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాజీపూర్, రాయపోల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ పూర్వ ప్రాథమిక విభాగాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు బోధించేందుకు స్థానిక అభ్యర్థుల నుంచి బోధకులు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. బోధకులుగా పనిచేయాలనుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలని, పూర్వ ప్రాథమిక లేదా ప్రాథమిక విద్యకు సంబంధించిన కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఎంపికైన బోధకులకు నెలకు రూ.8 వేల గౌరవ వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.6 వేల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోసడలింపు వర్తిస్తుందని వివరించారు. స్థానిక అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 12 సాయంత్రం 5 గంటలలోపు మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు పత్రాలు, పూర్తి వివరాలు సిద్ధిపేట జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ తెలిపారు.

# చెంగిచెర్ల శ్రీ లక్ష్మీనరసింహ కాలనీలో నీటి సమస్య

**చెంగిచెర్ల , జూన్9:**

చెంగిచెర్ల శ్రీ లక్ష్మీనరసింహ కాలనీలో నీటి సరఫరా విషయంలో జలమండలి అధికారుల తీరుతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతానికి అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన ఓ అధికారి తన ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవడం వల్లే ప్రస్తుతం సమస్యలు ఏర్పడ్డాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఆ అధికారి నివాసం ఉంటున్న ప్రాంతానికి మాత్రం పెద్ద పైపులైన్ల ద్వారా తగిన నీటి సరఫరా కల్పించగా, ఇతర ప్రాంతాలకు చిన్న పైపులైన్లతో సరఫరా జరగడం వల్ల నీటి ఒత్తిడి తగ్గి పలు కాలనీలకు నీరు సరిగా అందడం లేదని ఆరోపించారు. ఇటీవల ఆ అధికారి బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన అధికారులు సమస్య మూలాలను పూర్తిగా అర్థం చేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జలమండలి కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కాలనీలో నెలకొన్న నీటి సరఫరా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని చెంగిచెర్ల శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ వాసులు కోరుతున్నారు.

# ఆదిలాబాద్ డిసిసి బ్యాంక్ ఆర్థిక స్థితిగతులపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్ష



**అదిలాబాద్ జూన్9:**

సహకార రంగంలో బ్యాంకును మరింత లాభాల బాటలో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్, పర్సన్ ఇన్చార్జ్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కు సంబందించిన డీఎల్ఎంఆర్సీ, డీఎల్ఈసీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమీక్షా లో డిసిసి బ్యాంకు యొక్క ప్రస్తుత ఆర్థిక స్థితిగతులను, ప్రగతిని నిశితంగా సమీక్షించారు. బ్యాంకు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి, రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన పలు కీలక నిర్ణయాలపై చర్చించారు. సహకార రంగంలో బ్యాంకును మరింత లాభాల బాటలో ముందుకు తీసుకువెళ్లడానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా చేర్చడానికి అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సిఈఓ సిహెచ్. రవి, నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రావూఫ్, ఆదిలాబాద్ & నిర్మల్ జిల్లాల సహకార అధికారి ఎం. సత్యనారాయణ, మంచిర్యాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్, డీజీఎంలు టి. వెంకటేశ్వర స్వామి, జి. భీమేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**అశ్వారావుపేట, జూన్ 9:**

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్, బీటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అశ్వారావుపేటకు 4,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ప్రతి అర్హ పేద కుటుంబానికి ఇల్లు అందించే వరకు కార్యక్రమం కొనసాగుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ బెర్రీ ఐలాండ్ ను సందర్శించిన...

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



**తాడ్వాయి జూన్9:**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఏటూరునాగారం హై వే రోడ్డు మార్గంలో ఉన్న బ్లాక్ బెర్రీ ఐలాండ్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బ్లాక్ బెర్రీ ఐలాండ్ పరిసర ప్రాంతాలను, వాచ్ టవర్ ను పర్యాటకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

చురకలు



# కోటగిరిలో విషాదం: ట్రాక్టర్ కింద పడి రెండేళ్ల చిన్నారి దుర్మరణం

**కోటగిరి, జూన్ 09 :-**



కోటగిరి మండల కేంద్రంలో ఈరోజు ఉదయం జరిగిన ఒక విషాదకర ప్రమాదంలో రెండేళ్ల చిన్నారి మహాన్విక ప్రాణాలు కోల్పోయింది. గ్రామానికి చెందిన పాల గంగారం తన ట్రాక్టర్‌కు కల్టివేటర్‌ను తగిలించేందుకు ఉదయం 8:20 గంటల సమయంలో వాహనాన్ని వెనుకకు తీస్తుండగా, అదే సమయంలో అక్కడ ఆడుకుంటున్న ఆయన మనమరాలు మహాన్విక ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బంపర్‌కు తగిలింది. ఈ ఘటనలో చిన్నారి తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, చిన్నారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ దుర్ఘటనపై మృతురాలి తండ్రి విశ్వనాధ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చిన్నారి మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# క్యాలెండర్ ఆవిష్కరించిన స్పోర్ట్స్ మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**హైదరాబాద్ జూన్9 :**

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ మహబూబ్నగర్ జిల్లా యూనిట్ అసోసియేషన్ క్యాలెండర్ ను మంగళవారం మంత్రి గారి కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ ఎ.సోనీ బాల దేవి ఐ.ఎఫ్.ఎస్ గారిచే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచస్ అసోసియేషన్ మహబూబ్నగర్ జిల్లా యూనిట్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ డి.వై.ఎస్.ఓ & క్రికెట్ కోచ్ జనరల్ సెక్రటరీ జె.రాజశేఖర్ రెడ్డి, ఎం.సునీల్ కుమార్ అథ్లెటిక్ కోచ్ ప్రెసిడెంట్, సయ్యద్ అంజాద్ స్విమ్మింగ్ కోచ్ జిల్లా ట్రెజరర్, అబ్దుల్ రెహ్మాన్ ఖాన్ వాలీబాల్ కోచ్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ, వి.శంకర్ బాక్సింగ్ కోచ్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ, మల్లేష్ కబడ్డీ కోచ్ జిల్లా జాయింట్ సెక్రటరీ పాల్గొన్నారు.

# దేవాలయాల్లో చేనేత శాలువాల వినియోగానికి విజ్ఞప్తి



**హైదరాబాద్, జూన్ 9:**

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు చేనేతతో తయారు చేసిన శాలువాలనే అందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు గజం అంజయ్య అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం సమర్పించారు. యాదాద్రి, భద్రాచలం, బాసర, వేములవాడ తదితర దేవాలయాల్లో ప్రస్తుతం కృత్రిమ నూలుతో తయారైన శాలువాలు వినియోగిస్తున్నారని, వాటి స్థానంలో స్వచ్ఛమైన పత్తి లేదా పట్టు చేనేత శాలువాలను ప్రోత్సహించాలని అంజయ్య కోరారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అంజయ్య సూచనలను మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్వీకరించి, ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగంపై ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తుందని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.

# శిక్షణతో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి:

## సీఈఓ సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 9:**

రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు సంబంధించి మంగళవారం బీఆర్‌కే భవన్‌లో రాష్ట్రంలోని ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్ఓలు) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చడంతో పాటు అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఈసీఐనెట్, బీఎల్ఓ యాప్‌ల వినియోగం, ఎన్యూమరేషన్ ఫారాల నిర్వహణ, ఓటర్ల మ్యాపింగ్, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రక్రియ అమలులో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి ఎ.ఎస్. చారి, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు...

- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఏదులాపురం మునిసిపల్ పరిధిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ కరుణగిరి నూతన శాఖ ప్రారంభం

**ఖమ్మం, జూన్ 9:**



రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు అందనున్నాయని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలోని కరుణగిరిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) నూతన శాఖను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ఈ నూతన శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.సహకార రంగం అభివృద్ధి చెందితే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని, వ్యవసాయ రుణాలు, పొదుపు పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు ప్రజలకు సత్వరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు వెల్లడించారు. డీసీసీబీ విస్తరణతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, డీసీఓ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

# మహిళా సమాఖ్య అభివృద్ధికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రైవేట్ బస్సు కొనుగోలు.
- గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలకు అందజేత

**రాయపోల్, జూన్ 9:**



మహిళల ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య అన్నారు. రాయపోల్ మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య సభ్యులు తమ సహకారంతో కొనుగోలు చేసిన ప్రైవేట్ బస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలకు బస్సు ను అందజేశారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ, మహిళా సంఘాల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు పొదుపు, క్రమశిక్షణ, సమష్టి కృషితో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సమాఖ్య సభ్యులు స్వయంకృషితో బస్సును కొనుగోలు చేసి ప్రజా రవాణా రంగంలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఉపాధి అవకాశాలు, ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తోందన్నారు. మహిళా సంఘాల అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతోందని తెలిపారు. మహిళల ఐక్యత, పొదుపు అలవాటు, పట్టుదల వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవు తున్నాయని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఆదాయ వృద్ధి కార్యక్రమాలను చేపట్టి మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాసన్‌పల్లి రాజు, ఏపీఎం యాదగిరి, సీసీ కుమార్, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రికార్డు

## రబీ కొనుగోళ్లలో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జూన్ 9:**




రబీ ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 52 లక్షల మెట్రిక్ టన్నులకు పరిమితం చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం ఇప్పటివరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. ఈ కొనుగోళ్ల విలువ రూ.17,917 కోట్లుగా ఉందని, రైతులకు నేరుగా కనీస మద్దతు ధర చెల్లించామని తెలిపారు. దేశవ్యాప్తంగా రబీ ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ వాటా 61 శాతంగా ఉందని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ 25.03 లక్షల టన్నులు కొనుగోలు చేయగా, తెలంగాణ దాదాపు మూడు రెట్లు అధికంగా సేకరించిందన్నారు. ఖరీఫ్, రబీ కలిపి 2025-26లో మొత్తం 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.35,077 కోట్ల మద్దతు ధర చెల్లించామని చెప్పారు. రైతుల సౌకర్యార్థం ఖరీఫ్‌లో 8,448, రబీలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అకాల వర్షాలతో తడిసిన 12,557 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా ప్రత్యేక చర్యలతో కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి తెలిపారు. గన్నీ సంచుల కొరత లేదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం మానుకోవాలని సూచించారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి:

## కలెక్టర్ చిత్ర మిశ్రా

**కరీంనగర్, జూన్ 9:**

పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి చొప్పదండి, గంగాధర తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, సాదాబైనామా దరఖాస్తుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత ఫైళ్లు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీసీఎల్ఏ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులు, రికార్డులు, సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ధ్రువీకరణ ప్రక్రియ నిర్వహించి పెండింగ్ కేసులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందిస్తూ ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టరేట్ డీ సూపరింటెండెంట్ మోబిన్, తహసీల్దార్లు నవీన్ కుమార్, రజితతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# వర్షా కాల సన్నాహకాల్లో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బందికి ప్రత్యేక శిక్ష




**హైదరాబాద్, జూన్ 9:**

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేసేందుకు జీహెచ్ఎంసీ మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఆధ్వర్యంలో ఎంటమాలజీ ఫీల్డ్ సిబ్బందికి రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్, గోల్కొండ జోన్లలో రెండు విడతలుగా జరిగిన ఈ శిక్షణలో మొత్తం 586 మంది అధికారులు, సూపర్వైజర్లు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ సీఎంఓహెచ్ డాక్టర్ కె. పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దోమల పెంపక కేంద్రాల గుర్తింపు, నిర్మూలన, యాంటీ లార్వల్ చర్యలు, ఫాగింగ్, క్రిమిసంహారక మందుల సురక్షిత వినియోగం, వ్యాధుల పర్యవేక్షణ, అత్యవసర స్పందన చర్యలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు సోర్స్ రిడక్షన్, సర్వైలెన్స్, వెక్టర్ కంట్రోల్ చర్యలను మరింత ముమ్మరం చేయాలని సిబ్బందికి సూచించారు.



# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత పైడిమర్రి సుబ్బారావు

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్ధనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే.వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం.

తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు.

వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 – 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945–46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు.

1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్ధనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు.

1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లిష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు. 1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015–16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# హాస్య రస ప్రధాన చిత్ర దర్శకుడు ఈవీవీ

## నేడు సత్యనారాయణ జయంతి

టాలీవుడ్‌లో అత్యంత విజయ వంతమైన దర్శకుడిగా ఈవీవీ సత్యనారాయణ నిలిచాడు. ఆయన 80 మరియు 90 లలో చాలా సూపర్ హిట్స్ ఇచ్చాడు. రాఘవేంద్ర రావు సీనియర్ దర్శకునిగా దూసుకుపోతున్న రోజుల్లో ఆయనకు గట్టి పోటీ ఇచ్చి అంతకు మించిన హిట్లు అందు కున్నాడు ఈవీవీ రాఘవేంద్ర రావు స్టార్ హీరోలతో సినిమాలు తీస్తే, ఈవీవీ చిన్న హీరోలు, మధ్యస్థ హీరోలతో తీసి, హిట్లు, సూపర్ హిట్లు సాధించాడు. అలా 70 కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కమర్షియల్ హిట్‌లతో కె రాఘవేంద్రరావుకు గట్టి పోటీ ఇచ్చాడు. ఆయన సినిమాల్లో కామెడీకి పెద్ద పీట వేసేవాడు. అప్పట్లో చాలా బాధగా ఉంటే.. మద్యం వదిలేసి ఈవీవీ సినిమాలు చూడండి అంటూ జోకులు కూడా వేసుకునే వాడట. ఆయన సినిమాల్లో నాన్ స్టాప్ కామెడీ ఉండేది. ఇప్పటికీ ఈవీవీ సినిమాలు చూసి ఎంజాయ్ చేసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. అయితే తొలుత ఈవీవీ తన మొదటి సినిమా ఈవీవీ రాజేంద్ర ప్రసాద్‌ను హీరోగా పెట్టి తీసిన చెవిలో పువ్వు చిత్రం పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఫ్లాప్ అయ్యిందని.. గోదావరిలో దూకి చావాలని అనుకున్నాడట. ఓ సారి రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ అఘాయిత్యానికి పాల్పడడం అనుకుని.. మళ్ళీ తన పిల్లలు, భార్య గుర్తొచ్చి ఆగిపోయాడట. తరువాత ఆయన ప్రతిభను గుర్తించిన నిర్మాత రామానాయుడు 'ప్రేమఖైది' అనే చిత్రం చేసే అవకాశం కల్పించారు. అది పెద్ద హిట్ అయ్యింది. దీంతో వరుస అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి... అంటూ ఆయన చిన్న కొడుకు అల్లరి నరేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది.

ఈవీవీగా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ (జూన్ 10, 1958 – జనవరి 21, 2011) తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన దర్శకుడు. జంధ్యాల శిష్యుడు. జంధ్యాల ఒరవడిలో హాస్యప్రధాన చిత్రాలు నిర్మించాడు. జంధ్యాల కంటే కొంతఘాటైన హాస్యాన్ని చిత్రాల్లో ప్రవేశ పెట్టాడు. రాజేంద్ర ప్రసాద్ తో ఆ ఒక్కటి అడక్కు, అప్పుల అప్పారావు, ఆలీబాబా అరడజను దొంగలు వంటి చిత్రాలు, నరేష్ తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశాడు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది (శోభన్ బాబు) లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి మహిళా పరమైన చిత్రాలు తీశాడు. అగ్రనటులైన చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లతో చిత్రాలు తీశాడు. తర్వాత కుమారులిద్దర్ని



హీరోలుగా పరిచయం చేశాడు. సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని దొమ్మేరులో వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. నాన్న వెంకటరావు, అమ్మ వెంకటరత్నం. ఆయన కుటుంబానికి దొమ్మేరులో 70 ఎకరాల పొలం ఉండేది. బాల్యం నుండి సినిమాలంటే ఆసక్తితో కనీసం వారానికి రెండు సినిమాలైన చూసేవాడు. ఇంటర్మీడియట్ వరకు బుద్ధిగానే చదివినా, ఇంటర్‌కు నిడుదవోలు వెళ్ళిన సత్యనారాయణ కాలేజికి వెళ్ళకుండా రోజూ ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట సినిమాలను చూడటం ఎక్కువై, హాజరు తక్కువై ఇంటర్మీయడ్ తప్పాడు. అప్పుడు సత్యనారాయణ తండ్రి ఆయన ను కాలేజీకి పంపించి లాభం లేదని నిశ్చయించి తండ్రితో పాటు పొలం పనులు చూసుకోవటానికి నియమించాడు. 19 యేళ్ళకే 1976లో సరస్వతి కుమారితో పెళ్ళైంది. తర్వాత ఇద్దరు కొడుకులు పుట్టారు. వారికి రాజేష్, నరేష్ అని పేరు పెట్టారు. కొన్నాళ్ళకు వ్యవసాయంలో పెద్ద నష్టాలు రావడంతో పొలాలు అమ్మేయ వలసిన పరిస్థితి కలిగింది. ఆ పరిస్థితుల్లో అక్కడ ఉండటానికి సత్యనారాయణ ఇబ్బంది పడి ఎక్కడికైనా మరో ఊరికి వెళ్ళిపోవాలను కున్నాడు. ఇ.వి.వి స్నేహితుడు నిర్మాత నవతా కృష్ణంరాజు మేనల్లుడైన సుబ్బ రాజును సంప్రదించి ఒక సిఫారుసు ఉత్తరం పట్టుకుని మొదటిసారి మద్రాసు వెళ్ళాడు. నవతా కృష్ణం రాజును కలిసి ఉత్తరం ఇవ్వగా ఆయన సినీరంగంలో జీవితం అనుకున్నంత సులభం కాదని, తిరిగి సొంత ఊరికి వెళ్ళిపొమ్మని హితవు చెప్పాడు. దాంతో పూర్తిగా నిరాశచెందిన సత్యనారాయణ, తిరిగి వెళ్ళినా చేసేదేమీ లేదనుకుని మద్రాసులోనే ఉండి వివిధ ప్రదేశాలు తిరుగు తుండేవాడు. పాండీ బజారుకు వెళ్ళి అక్కడ సహాయ దర్శకులు చెప్పుకునే మాటలు వినేవాడు. ప్రతి ఉదయం నవత కృష్ణంరాజు కార్యాలయం గేటు వద్ద నుంచుని ఉండేవాడు. ఒక నెలరోజుల తర్వాత కుర్రవాని పట్టుదలను చూసి ఏం చెయ్య గలవు అని అడిగాడు. సహాయ దర్శకున్ని అవుతానని చెప్పిన ఇ.వి.విని కనకాల దేవదాసు క్రింద ఓ ఇంటి భాగోతం సినిమాకు సహాయ దర్శకునిగా అవకాశం కల్పించాడు.

రంభ, రచన, ఊహ, రవళి నటీమణులను తెలుగు చిత్ర సీమకు అయన పరిచయం చేశాడు. చెవిలో పువ్వు (1990), ప్రేమ ఖైదీ (1991), అప్పుల అప్పారావు (1991), సీతారత్నం గారి అబ్బాయి (1992), 420 (1992), జంబలకడి పంబ (1992), ఏవండీ ఆవిడ వచ్చింది (1993), వారసుడు (1993), ఆ ఒక్కటీ అడక్కు (1993), అబ్బాయి గారు (1993), ఆలీబాబా అరడజను దొంగలు (1994), హలో బ్రదర్ (1994), మగ రాయుడు (1994), ఆమె (1994), అల్లుడా మజాకా (1995), ఆయనకి ఇద్దరు (1995), తెలుగు వీర లేవరా (1995), ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు (1996), అదిరింది అల్లుడు (1996), అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (1996), చిలక్కొట్టుడు (1996), వీడెవడండీ బాబు (1997), నేను ప్రేమిస్తున్నాను (1997), తాళి (1997), మా నాన్నకి పెళ్ళి (1997), ఆవిడా మా ఆవిడే (1998), మావిడాకులు (1998), కన్యాదానం (1998), నేటి గాంధీ (1999), సూర్యవంశం (1999), పిల్ల నచ్చింది (1999), చాలా బాగుంది (2000), గొప్పింటి అల్లుడు (2000), అమ్మో ఒకటో తారీఖు (2001), మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది (2001), ధాంక్యూ సుబ్బారావ్ (2001), వీడెక్కడి మొగుడండి (2001), హాయ్ (2002), తొట్టి గ్యాంగ్ (2002), ఆడంతే అదోటైపు (2003), మా అల్లుడు వెరీగుడ్డు (2003), ఆరుగురు పతివ్రతలు (2004), ఎవడి గోల వాడిది (2005), నువ్వంటే నాకిష్టం (2005), కితకితలు (2006), అత్తిలి సత్తిబాబు ఎల్ కెజి (2007), పెళ్ళైంది కానీ... (2007), ఫిట్టింగ్ మాస్టర్ (2009), బెండు అప్పారావ్ ఆర్‌ఎంపి (2009), బురిడి (2010), కత్తి కాంతారావు (2010) తదితర చిత్రాలకు దర్శకత్వం వహించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి

## నేడు పోరాట యోధుడు బాల గోపాల్ జయంతి

పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం– కందాళ్ళ పార్ధనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలు గా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్‌డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకు డిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన ఖ లో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకు డాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్‌సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్‌సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసుల తో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్య హింస తోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి.

మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శిం చడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్‌లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్‌ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ–మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో



ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్య కలాపాలను విస్తరిం చాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాల గోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కో వటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్‌కౌంట ర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారా హిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.



# పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, జూన్ 9 :** గత వారం రోజులుగా వరుసగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు నేడు ఒక్కసారిగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరలు ఎగబాకడంతో దేశీయ మార్కెట్‌లోనూ అదే ప్రభావం కనిపించింది. మరోవైపు వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. బులియన్ మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, నేడు ఉదయం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,160కు చేరుకుంది. గత ముగింపు ధరతో పోలిస్తే రూ.1,470 మేర పెరుగుదల నమోదైంది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,350 పెరిగి రూ.1,40,400 వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి ధర రూ.2.70 లక్షల వద్ద స్థిరంగా ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు భారీగా పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,910కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,000గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,160గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,400గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,310కు చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,550గా నమోదైంది. దేశవ్యాప్తంగా సగటున 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,450 వరకు పెరుగుదల కనిపించింది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు మరోసారి ధరల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు బలంగా ట్రేడవుతున్నాయి. ఒక ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర నిన్నటితో పోలిస్తే 0.6 శాతం పెరిగి 4,330 డాలర్లను దాటింది. మరోవైపు వెండి ధర మాత్రం 1 శాతం తగ్గి ఔన్స్‌కు 67 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, డాలర్ కదలికలు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. రాబోయే రోజుల్లో కూడా పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఎల్పీజీ కొరతతో ఐఆర్‌సీటీసీ కీలక నిర్ణయం

### రైళ్లలో మళ్లీ వంటలు

**న్యూఢిల్లీ, జూన్ 9 :** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల ఆహార సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో భద్రతా కారణాలతో నిలిపివేసిన కదులుతున్న రైళ్లలో వంట చేసే విధానాన్ని మళ్లీ అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. అయితే ఈసారి సంప్రదాయ గ్యాస్ స్టవ్‌ల స్థానంలో పూర్తిగా విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టవ్‌లను వినియోగిస్తూ ఆహార తయారీ చేపట్టనుంది. దేశవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 17 లక్షల భోజనాలను 1,400కు పైగా రైళ్లలో ఐఆర్‌సీటీసీ సరఫరా చేస్తోంది. ఈ భారీ వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించేందుకు విద్యుత్ సదుపాయం కలిగిన ఎల్‌హెచ్‌బీ ప్యాంట్రీ కార్లలో వంట ప్రక్రియను ప్రారంభించింది. రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్ వంటి ప్రీమియం రైళ్లలో ఇప్పటికే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు వినియోగంలో ఉండటంతో ఈ మార్పు అమలు సులభమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా ప్రధాన రైల్వే స్టేషన్లలో ఇండక్షన్ ఆధారిత వంటకు అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యత కల్పించాలని ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్తాన్ పెట్రోలియం సంస్థలతో ప్రత్యేక ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ఈ మార్పుల వల్ల రైల్వే క్యాటరింగ్ వ్యవస్థలో జరిగే మొత్తం వంట ప్రక్రియలో దాదాపు 60 శాతం వరకు విద్యుత్ ఆధారిత విధానానికి మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా ఐఆర్‌సీటీసీ ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రభావం పడినట్లు సమాచారం. ముడి సరుకులు, గ్యాస్ ధరలు పెరగడంతో క్యాటరింగ్ విభాగం లాభదాయకత తగ్గినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయినప్పటికీ ప్రయాణికులకు ఆహార సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వేగంగా అమలు చేస్తున్నట్లు సంస్థ స్పష్టం చేసింది



## నెలకు రూ.10 వేల క్రమబద్ధ పెట్టుబడితో

# రూ.10 కోట్లు సాధ్యమే!




**హైదరాబాద్, జూన్ 9 :** పెట్టుబడుల్లో విజయాన్ని నిర్ణయించే ప్రధాన అంశం సమయం. చాలా మంది పెద్ద మొత్తంలో డబ్బు ఉంటేనే కోటీశ్వరులు కావచ్చని భావిస్తుంటారు. కానీ సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, దీర్ఘకాలిక పెట్టుబడులతో చిన్న మొత్తాల నుంచే భారీ సంపదను సృష్టించుకోవచ్చు. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్లలో ప్రతి నెలా క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టే విధానం ద్వారా చక్రవడ్డీ ప్రభావంతో కోట్ల రూపాయల సంపదను నిర్మించుకునే అవకాశం ఉంటుంది. ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు దీర్ఘకాలంలో సగటున 12 శాతం వరకు వార్షిక రాబడిని అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ రాబడి ఆధారంగా చూస్తే, నెలకు కేవలం రూ.10,000 చొప్పున పెట్టుబడి ప్రారంభించినా రూ.10 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమే. అయితే అందుకు ఓపిక, క్రమశిక్షణ తప్పనిసరి. ప్రతి నెలా రూ.10,000 చొప్పున పెట్టుబడి పెడుతూ, ప్రతి సంవత్సరం ఆ మొత్తాన్ని 10 శాతం చొప్పున పెంచుకుంటూ వెళితే సుమారు 31 సంవత్సరాల్లో రూ.10 కోట్లకు పైగా సంపదను సృష్టించుకోవచ్చు. ఈ కాలంలో మొత్తం పెట్టుబడి దాదాపు రూ.2.18 కోట్లు మాత్రమే అయినప్పటికీ, చక్రవడ్డీ ద్వారా వచ్చిన రాబడులు రూ.8 కోట్లకు చేరుకునే అవకాశం ఉంటుంది. అదే నెలకు రూ.25,000తో ప్రారంభించి, ప్రతి ఏడాది పెట్టుబడి మొత్తాన్ని 10 శాతం పెంచుకుంటూ వెళితే సుమారు 25 సంవత్సరాల్లో రూ.10 కోట్లకు పైగా కార్పస్ సమకూరే అవకాశం ఉంది. మొత్తం పెట్టుబడి రూ.2.95 కోట్ల వరకు ఉండగా, మిగిలిన భారీ మొత్తం రాబడుల రూపంలో వస్తుంది. ఇక నెలకు రూ.50,000తో పెట్టుబడి ప్రారంభించి ప్రతి సంవత్సరం 10 శాతం చొప్పున పెంచుకుంటూ వెళితే కేవలం 20 సంవత్సరాల్లోనే రూ.10 కోట్ల లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంది. ఈ సందర్భంలో మొత్తం పెట్టుబడి సుమారు రూ.3.44 కోట్లు కాగా, మిగిలిన మొత్తం చక్రవడ్డీ ప్రభావంతో పెరిగిన రాబడుల రూపంలో లభిస్తుంది. ప్రతి ఏడాది పెట్టుబడి మొత్తాన్ని కొద్దికొద్దిగా పెంచే విధానం పెట్టుబడిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఉద్యోగాల్లో జీతాలు పెరిగినట్లే, పెట్టుబడి మొత్తాన్ని కూడా పెంచడం వల్ల సంపద వేగంగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల భారీ ఆర్థిక లక్ష్యాలను తక్కువ సమయంలోనే చేరుకోవచ్చు. అలాగే ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు పెట్టాల్సిన అవసరం ఉండదు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలనుకునే వారికి క్రమబద్ధ పెట్టుబడి విధానం ఒక అద్భుతమైన మార్గం. ఎంత చిన్న మొత్తంతో ప్రారంభించినా, క్రమం తప్పకుండా పెట్టుబడులు కొనసాగిస్తూ, కాలక్రమేణా మొత్తాన్ని పెంచుకుంటూ వెళితే కోట్ల రూపాయల సంపదను సృష్టించుకోవచ్చు. పెట్టుబడుల్లో తొందరగా ప్రారంభించడం, దీర్ఘకాలం కొనసాగించడం, మధ్యలో ఆపకుండా క్రమశిక్షణతో ఉండటం విజయానికి కీలకమైన అంశాలు. అయితే మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌కు లోబడి ఉంటాయని గుర్తుంచుకోవాలి. గతంలో వచ్చిన రాబడులు భవిష్యత్తులో కూడా అదే స్థాయిలో వస్తాయని ఎలాంటి హామీ ఉండదు. కాబట్టి పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

# ఉజ్వల లబ్ధిదారులకు షాక్

### సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు 9 నుంచి 4కు కుదింపు



**న్యూఢిల్లీ, జూన్ 9 :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులకు కీలక మార్పు ప్రకటించింది. ఇప్పటివరకు ఏడాదికి 9 సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్లపై అందుతున్న రాయితీని ఇకపై కేవలం 4 సిలిండర్లకే పరిమితం చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉజ్వల లబ్ధిదారులపై ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. 2016లో ప్రారంభమైన ఉజ్వల పథకం కింద పేద కుటుంబాలకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు అందించడంతో పాటు సబ్సిడీ ప్రయోజనాలు కల్పించారు. ప్రారంభంలో ఏడాదికి 12 సబ్సిడీ సిలిండర్లకు అర్హత ఉండేది. అనంతరం ఈ సంఖ్యను 9కు తగ్గించగా, తాజాగా మరోసారి కోత విధిస్తూ 4 సిలిండర్లకే పరిమితం చేశారు. ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా లబ్ధిదారుల సగటు వినియోగాన్ని ప్రభుత్వం పేర్కొంటోంది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికారుల ప్రకారం, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు పొందిన కుటుంబాలు సగటున ఏడాదికి నాలుగు సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్లు గణాంకాలు వెల్లడించాయి. అదే వినియోగ స్థాయిని దృష్టిలో పెట్టుకుని సబ్సిడీ పరిమితిని నిర్ణయించినట్లు అధికారులు వివరించారు. అలాగే సబ్సిడీ సిలిండర్ల దుర్వినియోగం, అక్రమ విక్రయాలు, పక్కదారి పట్టింపు వంటి అంశాలు కూడా ప్రభుత్వ ఆందోళనకు కారణమైనట్లు సమాచారం. కొంతమంది లబ్ధిదారుల పేర్లతో తక్కువ ధరకు పొందిన సిలిండర్లను ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సబ్సిడీ వ్యవస్థను మరింత లక్ష్యబద్ధంగా మార్చేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సబ్సిడీ పూర్తిగా రద్దు కాలేదు. ఉజ్వల లబ్ధిదారులకు ఇప్పటివరకు అందుతున్నట్లుగానే ఒక్కో 14.2 కిలోల సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ కొనసాగుతుంది. కానీ ఈ రాయితీ ఇకపై ఏడాదిలో మొదటి నాలుగు రీఫిల్లులకే వర్తించనుంది. ఆ తర్వాత తీసుకునే సిలిండర్లకు పూర్తి మార్కెట్ ధర చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరగడం, దేశీయంగా వంటగ్యాస్ ధరలు వరుసగా పెరుగుతుండటం కూడా ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారడానికి కారణమైంది. ఇప్పటికే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరలు పెరిగిన నేపథ్యంలో సబ్సిడీ పరిమితి తగ్గించడం పేద కుటుంబాలపై అదనపు భారం మోపే అవకాశముందని పలువురు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం నిజమైన వినియోగ అవసరాలకు అనుగుణంగా సబ్సిడీని పునర్వ్యవస్థీకరించామని, పథకం లక్ష్యాలను కొనసాగిస్తూనే వ్యయ నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చామని స్పష్టం చేసింది

# హైదరాబాద్‌లోకి యెజ్డీ, బీఎస్‌ఏ కొత్త స్క్రాంబ్లర్ బైకులు




**హైదరాబాద్, జూన్ 9 :** ద్విచక్ర వాహన ప్రియులను ఆకట్టుకునేందుకు యెజ్డీ, బీఎస్‌ఏ బ్రాండ్‌లు తమ సరికొత్త స్క్రాంబ్లర్ మోటార్‌సైకిళ్లను హైదరాబాద్ మార్కెట్లో విడుదల చేశాయి. క్లాసిక్ లెజెండ్స్ సంస్థకు చెందిన ఈ ప్రముఖ బ్రాండ్‌లు 'యెజ్డీ స్క్రాంబ్లర్ 350', 'బీఎస్‌ఏ స్క్రాంబ్లర్ 650' మోడళ్లను అధికారికంగా అందుబాటులోకి తీసుకొచ్చాయి. నగర రహదారులతో పాటు హైవేలు, కఠినమైన ఆఫ్‌రోడ్ మార్గాల్లోనూ అద్భుతమైన పనితీరును అందించేలా ఈ బైకులను రూపొందించారు. యువ రైడర్లను లక్ష్యంగా చేసుకుని శక్తివంతమైన ఇంజన్లు, ఆధునిక సాంకేతికత, క్లాసిక్ డిజైన్‌లతో ఈ మోడళ్లను అభివృద్ధి చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మోటార్‌సైక్లింగ్ ప్రపంచంలో ఎస్‌యూవీ తరహా అనుభూతిని అందించే వాహనాలుగా ఇవి నిలుస్తాయని క్లాసిక్ లెజెండ్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ థరేజా పేర్కొన్నారు. భారతదేశంలోనే అత్యంత తేలికైన 350 సీసీ స్క్రాంబ్లర్ బైక్‌గా యెజ్డీ స్క్రాంబ్లర్ 350 ప్రత్యేక గుర్తింపు పొందింది. సరికొత్త లిక్విడ్ కూల్డ్ కటార్ ఇంజన్‌తో రూపొందిన ఈ బైక్ అద్భుతమైన టార్క్-టు-వెయిట్ నిష్పత్తిని కలిగి ఉంది. ప్రారంభ ఆఫర్ కింద ఈ మోడల్ ఎక్స్-షోరూమ్ ధర రూ.1,99,950గా నిర్ణయించారు. ఇక బీఎస్‌ఏ స్క్రాంబ్లర్ 650 బ్రిటీష్ క్లాసిక్ స్టైల్‌ను ప్రతిబింబించేలా రూపొందించబడింది. గోల్డ్ స్టార్ కటాలినా డిజైన్ ప్రభావంతో వచ్చిన ఈ బైక్ దేశంలోనే ఏకైక 650 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజన్‌తో శక్తిని అందిస్తుంది. తక్కువ, మధ్యస్థ వేగాల్లో అత్యుత్తమ టార్క్‌ను అందించే ఈ ప్రీమియం మోడల్ ప్రారంభ ధర రూ.3,24,950గా ఉంది. వినియోగదారుల నమ్మకాన్ని పెంచేందుకు కంపెనీ ప్రత్యేక వారెంటీ సదుపాయాలను కూడా ప్రకటించింది. ఈ రెండు మోడళ్లపై 4 సంవత్సరాలు లేదా 50,000 కిలోమీటర్ల వరకు ప్రామాణిక వారెంటీ లభిస్తుంది. అదనంగా వారెంటీని 6 సంవత్సరాల వరకు పొడిగించుకునే అవకాశం కూడా కల్పించారు. ఒక సంవత్సరం పాటు ఉచిత రోడ్‌సైడ్ సహాయం సేవలతో పాటు దేశవ్యాప్తంగా 400కిపైగా సర్వీస్ కేంద్రాల మద్దతును సంస్థ అందిస్తోంది. క్లాసిక్ డిజైన్, ఆధునిక సాంకేతికత, ఆఫ్‌రోడ్ సామర్థ్యాల కలయికతో వచ్చిన ఈ కొత్త స్క్రాంబ్లర్ మోడళ్లు హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా అడ్వెంచర్ బైక్ ప్రేమికులను ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పాముల భయం.. ఫుట్‌బాల్ జట్టుకు హెచ్చరిక







**న్యూఢిల్లీ, జూన్ 9:** ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన ప్రపంచకప్ ప్రారంభానికి ముందే స్విట్జర్లాండ్ జట్టుకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. టోర్నమెంట్ కోసం అమెరికాలో శిక్షణ పొందుతున్న ఆ జట్టు ఆటగాళ్లకు స్థానిక అధికారులు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేశారు. వారు శిక్షణ పొందుతున్న ప్రాంతం సమీపంలో అత్యంత విషపూరితమైన పాములు సంచరిస్తున్నట్లు గుర్తించడంతో ఈ జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్ జట్టు అమెరికాలోని శాన్ డియాగో ప్రాంతంలో సాధన కొనసాగిస్తోంది. అయితే అక్కడి శిక్షణ కేంద్రం చుట్టుపక్కల అత్యంత ప్రమాదకరమైన విషసర్ప జాతులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు వన్యప్రాణి అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా రాటిల్ స్నేక్‌గా పిలిచే విషసర్పాల నాలుగు రకాల జాతులు ఆ ప్రాంతంలో నివసిస్తున్నాయని గుర్తించారు. ఈ పాముల కాటు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉండటంతో ఆటగాళ్లు శిక్షణ మైదానం పరిమితులు దాటి వెళ్లవద్దని యాజమాన్యం ఆదేశించింది. శిక్షణ సమయంలో ఫుట్‌బాల్ బంతులు కొన్నిసార్లు మైదానం దాటి పొదల్లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటిని తిరిగి తెచ్చుకోవడం సహజమే అయినప్పటికీ, ఈ శిబిరంలో మాత్రం అలాంటి సాహసాలకు పూర్తిగా నో చెప్పేశారు. పొరపాటున బంతి మైదానం వెలుపలికి వెళ్లినా దానిని తీసుకురావడానికి ఎవరూ వెళ్లవద్దని, కొత్త బంతులతోనే సాధన కొనసాగించాలని ఆటగాళ్లకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ ప్రపంచకప్‌లో స్విట్జర్లాండ్ జట్టు గ్రూప్-బిలో స్థానం దక్కించుకుంది. అదే గ్రూప్‌లో ఆతిథ్య దేశం కెనడాతో పాటు ఖతార్, బోస్నియా-హెర్జెగోవినా జట్లు ఉన్నాయి. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో స్థిరమైన ప్రదర్శనకు పేరుగాంచిన స్విట్జర్లాండ్ జట్టు, మైదానంలో క్రమశిక్షణతో కూడిన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఇప్పుడు ఈ అనూహ్య పరిస్థితులను అధిగమిస్తూ టోర్నమెంట్‌లో ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈసారి ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత విస్తృత స్థాయిలో నిర్వహించబడుతోంది. జూన్ 12 నుంచి ప్రారంభమై జూలై 19 వరకు సాగే ఈ మెగా టోర్నీలో తొలిసారిగా 48 జట్లు పాల్గొంటున్నాయి. అలాగే అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తుండటం కూడా ప్రపంచకప్ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది

# స్టోక్స్‌కు కొత్త చిక్కులు



**లండన్, జూన్ 9 :** ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ మరోసారి వివాదంలో చిక్కుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. జట్టు క్రమశిక్షణ నిబంధనలను ఉల్లంఘించిన ఘటనపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్‌పై లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో విజయం సాధించిన అనంతరం స్టోక్స్, సహచర ఆటగాడు గస్ అట్కిన్‌సన్‌తో కలిసి ఒక రాత్రి వినోద కేంద్రానికి వెళ్లినట్లు సమాచారం. అక్కడ చోటుచేసుకున్న ఘర్షణ ఇప్పుడు ఇంగ్లండ్ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ఆ వినోద కేంద్రంలో ఒక రగ్బీ క్రీడాకారుడితో మాటామాటా పెరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో అట్కిన్‌సన్‌ను లక్ష్యంగా చేసుకుని విసిరిన దెబ్బ, అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందికి తగిలినట్లు తెలుస్తోంది. గాయపడిన భద్రతా సిబ్బందికి వైద్య చికిత్స అందించగా, కుట్లు కూడా వేసినట్లు సమాచారం. అయితే ఈ ఘటనలో స్టోక్స్ లేదా అట్కిన్‌సన్‌కు ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. ఈ ఘటనపై స్పందించిన ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వర్గాలు, ఇద్దరు ఆటగాళ్లు దురుసుగా ప్రవర్తించినట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నాయి. అలాగే ఘటన స్థలానికి పోలీసులు కూడా రాలేదని వెల్లడించాయి. అయినప్పటికీ అసలు ఏం జరిగిందనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో ఆటగాళ్ల ప్రవర్తనపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రత్యేక దృష్టి పెట్టింది. జట్టు సభ్యులు అర్ధరాత్రి తర్వాత బయట తిరగకుండా కఠిన మార్గదర్శకాలు అమలు చేస్తోంది. గతంలో చోటుచేసుకున్న కొన్ని వివాదాల నేపథ్యంలో ఈ నిబంధనలను మరింత కఠినతరం చేశారు. రాత్రి వేళ వినోద కేంద్రాలకు వెళ్లకుండా ఉండాలని ఆటగాళ్లకు ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే న్యూజిలాండ్‌పై విజయం సాధించిన తర్వాత జరిగిన సంబరాల్లో భాగంగా స్టోక్స్, అట్కిన్‌సన్ నిర్ణయించిన సమయాన్ని దాటి అక్కడే కొనసాగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఘర్షణ చోటుచేసుకుని ఉండవచ్చని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. దీంతో క్రమశిక్షణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ వివాదం కారణంగా స్టోక్స్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అతడిని తదుపరి టెస్టుకు దూరం పెట్టవచ్చనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అదే విధంగా అట్కిన్‌సన్ భవితవ్యంపైనా స్పష్టత రావాల్సి ఉంది. కాగా, గతంలో కూడా స్టోక్స్ రాత్రి వేళ జరిగిన ఘర్షణ ఘటనతో వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి అతని పేరు వివాదంలో వినిపించడంతో ఇంగ్లండ్ క్రికెట్ వర్గాల్లో చర్చ మరింత వేడెక్కింది. విచారణ పూర్తయ్యే వరకు ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు ముందే వైభవ్ సంచలనం




**ముంబై, జూన్ 9 :** భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చింది. బీహార్‌కు చెందిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన అసాధారణ ప్రతిభతో దేశ విదేశాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాడు. ఇంకా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టకముందే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం అతడి ప్రత్యేకతగా నిలుస్తోంది. చిన్న వయసులోనే అతడు ప్రదర్శిస్తున్న దూకుడు ఆటతీరు, భారీ షాట్లు మరియు ఆత్మవిశ్వాసంతో కూడిన బ్యాటింగ్ క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత కొంతకాలంగా దేశీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనలు చేస్తున్న వైభవ్, ఇటీవల జరిగిన ప్రముఖ లీగ్ పోటీల్లో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మరింత గుర్తింపు సంపాదించాడు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా అనుభవజ్ఞులైన బౌలర్లపై ఎదురుదాడికి దిగుతున్న తీరు సెలెక్టర్లను సైతం ఆకట్టుకుంది. భారీ షాట్లతో పరుగుల వరద పారిస్తూ తనలోని ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాడు. అతని ప్రతిభను గుర్తించిన భారత క్రికెట్ బోర్డు ఇప్పటికే పలు కీలక యువజన టోర్నీలకు ఎంపిక చేసే దిశగా అడుగులు వేస్తోంది. చిన్న వయసులోనే పెద్ద వేదికలపై ఆడే అవకాశాలు దక్కుతుండటంతో వైభవ్‌పై అంచనాలు మరింత పెరిగాయి. భారత క్రికెట్ భవిష్యత్తుకు అతడు ఒక కీలక ఆటగాడిగా మారే అవకాశాలు ఉన్నాయని పలువురు మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. వైభవ్ పేరు ఇప్పుడు దేశానికే పరిమితం కాలేదు. విదేశీ క్రికెట్ వర్గాల్లో కూడా అతడి ఆటతీరు గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంగ్లాండ్‌కు చెందిన మాజీ ఆటగాళ్లు, విశ్లేషకులు అతని బ్యాటింగ్‌ను ప్రశంసిస్తూ మాట్లాడుతున్నారు. చిన్న వయసులోనే నాణ్యమైన బౌలింగ్‌ను ధైర్యంగా ఎదుర్కొంటూ భారీ షాట్లు ఆడగలగడం అసాధారణమని వారు పేర్కొంటున్నారు. ఒక టోర్నీ మొత్తం అత్యంత వేగంగా పరుగులు సాధిస్తూ అదే స్థాయి దూకుడును కొనసాగించడం అరుదైన విషయమని కొనియాడుతున్నారు. ఇంగ్లాండ్ వంటి స్వింగ్, సీమ్‌కు అనుకూల పరిస్థితుల్లో కూడా వైభవ్ ఎలా రాణిస్తాడో చూడాలనే ఆసక్తి క్రికెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. విదేశీ పిచ్‌లపై అతని సాంకేతిక నైపుణ్యం ఎంతవరకు పనిచేస్తుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటివరకు అతడు చూపించిన ప్రతిభను పరిశీలిస్తే భవిష్యత్తులో అన్ని పరిస్థితులకు అనుగుణంగా ఆడగల సామర్థ్యం ఉన్న ఆటగాడిగా కనిపిస్తున్నాడని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీపై నెలకొన్న అంచనాలు చూస్తుంటే, అతడు తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడకముందే స్టార్ హోదాను సంపాదించుకున్నట్టే కనిపిస్తోంది. అయినప్పటికీ అసలు పరీక్ష ఇప్పుడు ప్రారంభం కానుంది. దేశీయ స్థాయిలో మరియు లీగ్ పోటీల్లో చూపించిన అదే స్థాయి ప్రదర్శనను అంతర్జాతీయ వేదికపై కూడా కొనసాగించగలిగితే భారత క్రికెట్‌కు మరో గొప్ప ఆటగాడు దొరికినట్టేనని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ యువ సంచలనం రాబోయే రోజుల్లో ఎలా రాణిస్తాడో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతడి తొలి అంతర్జాతీయ ఇన్నింగ్స్ కోసం ఇప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచ క్రికెట్ ప్రేమికులందరూ ఆసక్తిగా నిరీక్షిస్తున్నారు.



# వింత రనౌట్‌తో ఆర్యా ఔట్

**డంబుల్లా, జూన్ 9 :** శ్రీలంక-ఏ జట్టుతో జరుగుతున్న తొలి వన్డే మ్యాచ్‌లో భారత-ఏ జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిరాశపరిచాడు. కేవలం 12 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరగా, మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా తక్కువ స్కోరుకే అవుటయ్యాడు. ఆరంభంలో వరుస వికెట్లు కోల్పోయిన భారత్‌ను రుతురాజ్ గైక్వాడ్, ప్రియాంశ్ ఆర్యా నిలబెట్టే ప్రయత్నం చేశారు. ఇద్దరూ కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టిన సమయంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. 13వ ఓవర్‌లో జరిగిన ఈ సంఘటన మ్యాచ్‌లో చర్చనీయాంశంగా మారింది. స్ట్రైక్‌లో ఉన్న రుతురాజ్ గైక్వాడ్ షాట్ ఆడిన తర్వాత రెండో పరుగుకు ప్రయత్నించాడు. నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న ప్రియాంశ్ ఆర్యా కూడా మొదట రెండో పరుగుకు బయల్దేరినా, మధ్యలో తిరిగి క్రీజ్ వైపు వచ్చేశాడు. ఇదే సమయంలో రుతురాజ్ రెండో పరుగు పూర్తి చేసి తన క్రీజ్‌లోకి చేరిపోయాడు. అయితే నాన్‌స్ట్రైకర్ ఎండ్ వద్ద క్రీజ్‌లోకి చేరేందుకు ప్రయత్నించిన ప్రియాంశ్ ఆర్యాకు అనుకోని అడ్డంకి ఎదురైంది. శ్రీలంక వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా షూ అతడి బ్యాట్‌కు అడ్డుగా రావడంతో బ్యాట్ క్రీజ్‌లోకి పూర్తిగా చేరలేదు. ఆ క్షణాన్ని గమనించిన లంక ఆటగాళ్లు వెంటనే బంతిని వికెట్ల వైపు విసరగా, బ్యాట్ క్రీజ్‌లో లేకపోవడంతో అంపైర్ రనౌట్‌గా ప్రకటించాడు. ఇప్పటికే క్రీజ్‌లో స్థిరపడుతున్న ఆర్యా ఇలాంటి దురదృష్టకర రీతిలో అవుట్ కావడం భారత జట్టుకు ఎదురుదెబ్బగా మారింది. అతడి రనౌట్‌పై సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు అభిమానులు ఇది పూర్తిగా దురదృష్టకర ఘటన అని అభిప్రాయపడుతుండగా, మరికొందరు క్రీజ్‌లో బ్యాట్‌ను సురక్షితంగా ఉంచకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక మ్యాచ్‌లో భారత-ఏ జట్టు తరఫున రుతురాజ్ గైక్వాడ్ అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఒత్తిడిలో బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసిన అతడు మూడు అంకెల స్కోరు నమోదు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. కెప్టెన్ తిలక్ వర్మ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడి 60 పరుగులు సాధించాడు. వీరిద్దరి భాగస్వామ్యమే భారత జట్టును కష్టకాలం నుంచి గట్టెక్కించింది.

# సెంచరీతో సెలెక్టర్లకు గట్టి సమాధానం

**కొలంబో, జూన్ 9 :** అఫ్గానిస్థాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు భారత జట్టులో చోటు దక్కకపోవడంతో చర్చనీయాంశంగా మారిన రుతురాజ్ గైక్వాడ్, తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ తొలి మ్యాచ్‌లో శ్రీలంక-ఏ జట్టుపై అద్భుత శతకం బాది తన సత్తా చాటుకున్నాడు. క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుతంగా ఆడుతూ జట్టును ఆదుకున్న అతడి ఇన్నింగ్స్ క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్-ఏ జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తక్కువ స్కోరుకే ఔటవ్వగా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా నిరాశపరిచాడు. మరోవైపు ప్రియాంశ్ ఆర్య రనౌట్ కావడంతో జట్టు ఒత్తిడిలో పడింది. ఈ పరిస్థితుల్లో క్రీజులో నిలిచిన రుతురాజ్ గైక్వాడ్, కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఇద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. శ్రీలంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. తిలక్ వర్మ ఒక వైపు నిలకడగా ఆడుతుండగా, రుతురాజ్ అవకాశమొచ్చినప్పుడల్లా బౌండరీలు బాదుతూ పరుగుల వేగాన్ని కొనసాగించాడు. వీరిద్దరి జోడీ నాలుగో వికెట్‌కు 150 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నమోదు చేసి జట్టును పటిష్ట స్థితికి చేర్చింది. ఈ మ్యాచ్ రుతురాజ్‌కు మరింత ప్రత్యేకమైంది. ఇది అతని వందో లిస్ట్-ఏ మ్యాచ్ కాగా, అదే మ్యాచ్‌లో శతకం సాధించి చిరస్మరణీయంగా మార్చుకున్నాడు. 112 బంతుల్లో శతకం పూర్తి చేసిన అతడు, తన లిస్ట్-ఏ కెరీర్‌లో 21వ శతకాన్ని నమోదు చేశాడు. ఒత్తిడిని తట్టుకుని ఆడిన ఈ ఇన్నింగ్స్ అతని సాంకేతిక నైపుణ్యాన్ని, మానసిక దృఢత్వాన్ని మరోసారి నిరూపించింది. విరాట్ కోహ్లీ గాయంతో అఫ్గానిస్థాన్ సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో అతని స్థానానికి రుతురాజ్ సరైన ఎంపిక అయ్యేవాడని పలువురు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇన్నింగ్స్‌ను నిర్మించగల సామర్థ్యం, స్ట్రైక్‌ను చక్కగా మార్చడం, పరిస్థితులకు అనుగుణంగా ఆడగల నైపుణ్యం రుతురాజ్‌కు ఉన్నాయని వారు చెబుతున్నారు. ఈ శతకంతో సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదనే వాదనకు మరింత బలం చేకూరింది అయితే శతకం అనంతరం ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయిన రుతురాజ్, 114 బంతుల్లో 101 పరుగులు చేసి ఔటయ్యాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో బంతిని గాల్లోకి లేపగా, లోతైన మిడ్ వికెట్ ప్రాంతంలో ఉన్న ఫీల్డర్ అద్భుత క్యాచ్ పట్టడంతో అతని ఇన్నింగ్స్ ముగిసింది. అయినప్పటికీ అతడు ఆడిన శతక ఇన్నింగ్స్ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.






# ‘మహేంద్రగిరి వారాహి’ టీజర్‌తో పెరిగిన ఆసక్తి

భక్తి, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న మహేంద్రగిరి వారాహి చిత్ర టీజర్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నటుడు సుమంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాళవిక నాయర్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి గోస్వామి కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా విడుదలైన టీజర్‌లో మహేంద్రగిరి అనే గ్రామం, అక్కడి ప్రజల విశ్వాసాలు, వారాహి అమ్మవారి ఆరాధన, ఒక వంశాన్ని వెంటాడుతున్న శాపం చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. గ్రామంలో జరుగుతున్న రహస్య ఘటనలు, వాటి వెనుక దాగి ఉన్న మర్మాన్ని ఛేదించేందుకు హీరో చేసే ప్రయత్నాలు కథకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టీజర్ సూచిస్తోంది. ప్రత్యేకంగా గ్రామీణ నేపథ్యంలో సృష్టించిన భయానక వాతావరణం, దేవతా శక్తులతో ముడిపడిన సంఘటనలు ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. వారాహి అమ్మవారి శాపానికి గ్రామంలో జరుగుతున్న విచిత్ర పరిణామాలకు ఉన్న సంబంధం ఏమిటన్న ప్రశ్నను టీజర్ ఆసక్తికరంగా ముందుకు తెచ్చింది. సుమంత్ పాత్ర ఈ చిత్రంలో ఇన్వెస్టిగేటివ్ కోణంలో సాగుతుండగా, మాళవిక నాయర్, ఐశ్వర్య రాజేష్ పాత్రలు కథలో కీలక మలుపులకు కారణమయ్యేలా కనిపిస్తున్నాయి. అలాగే బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, అలీ, రాజీవ్ కనకాల వంటి నటులు కథలో వినోదం, భావోద్వేగాలకు బలం చేకూర్చనున్నట్లు తెలుస్తోంది. సాంకేతిక విభాగం కూడా టీజర్‌లో ఆకట్టుకుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మిస్టరీ వాతావరణాన్ని మరింత బలపరచగా, సినిమాటోగ్రఫీ మహేంద్రగిరి గ్రామాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. విజువల్స్, మేకింగ్ స్టైల్ చూస్తుంటే దర్శకుడు మరో విభిన్న కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తానికి ‘మహేంద్రగిరి వారాహి’ టీజర్ భక్తి, ఉత్కంఠ, రహస్య అంశాల కలయికతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. వారాహి అమ్మవారి శాపం వెనుక దాగి ఉన్న అసలు రహస్యం ఏమిటి? దాన్ని హీరో ఎలా ఛేదిస్తాడు? అనే ఆసక్తిని పెంచుతూ సినిమా విడుదలపై అంచనాలను మరింత పెంచింది.

# ‘పెద్ది’ బాక్సాఫీస్ దుమ్మురేపుతోంది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన ‘పెద్ది’ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలై తొలి ప్రదర్శన నుంచే బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో అన్ని ప్రాంతాల్లో భారీ వసూళ్లు నమోదు చేస్తూ దూసుకుపోతోంది. సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.315 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులు సృష్టించింది. రామ్ చరణ్ కెరీర్‌లో అత్యంత వేగంగా రూ.300 కోట్ల క్లబ్‌లో చేరిన సోలో చిత్రంగా ‘పెద్ది’ ప్రత్యేక గుర్తింపు పొందింది. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలో మెప్పించారు. అలాగే బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు తదితర ప్రముఖ నటులు ముఖ్య పాత్రల్లో నటించి కథకు మరింత బలం చేకూర్చారు. చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన సరాతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రతి సన్నివేశాన్ని మరింత ఎలివేట్ చేసేలా ఆయన సరాతం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మరోవైపు ప్రముఖ ఛాయాగ్రాహకుడు రత్నవేలు అందించిన అద్భుతమైన విజువల్స్ సినిమాకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చాయి. రామ్ చరణ్ నటన, భావోద్వేగ సన్నివేశాలు, స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కించిన యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలకు థియేటర్లలో ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువత కూడా సినిమాకు పెద్ద ఎత్తున ఆదరణ చూపుతున్నారు. విడుదలైన అన్ని ప్రాంతాల్లో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ‘పెద్ది’ రెండో వారంలోనూ ఇదే జోరు కొనసాగిస్తే మరిన్ని బాక్సాఫీస్ రికార్డులు బద్దలయ్యే అవకాశం ఉందని సినీ వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ చిత్రం బలమైన వసూళ్లు నమోదు చేస్తూ విజయయాత్ర కొనసాగిస్తోంది.




# బిగ్‌బాస్ 10లో పల్లవి గౌడ?

## సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం



తెలుగు టెలివిజన్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘బిగ్‌బాస్ తెలుగు’ పదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే తొమ్మిది విజయవంతమైన సీజన్లను పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఈసారి మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదలైన ప్రోమోతో షోపై అంచనాలు మరింత పెరిగాయి ఈ సీజన్‌కు కూడా ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. గత కొన్ని సీజన్లుగా తన ప్రత్యేక శైలి, హోస్టింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాగార్జున ఈసారి కూడా కంటెస్టెంట్లను ఎలా నడిపిస్తారో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈసారి ‘దశావతారం’ అనే కాన్సెప్ట్‌తో షోను కొత్తగా రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత సీజన్లతో పోలిస్తే కొత్త నిబంధనలు, వినూత్న టాస్కులు, మరింత కఠినమైన గేమ్ ప్లాన్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారని సమాచారం. దీంతో పదో సీజన్‌పై ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఇదిలా ఉండగా, షో ప్రారంభానికి ముందే కంటెస్టెంట్ల జాబితాపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈసారి హౌస్‌లోకి అడుగుపెట్టబోతున్నారంటూ పలువురు టెలివిజన్, యూట్యూబ్, సోషల్ మీడియా ప్రముఖుల పేర్లు వైరల్ అవుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, నందూస్ వరల్డ్ నందూ, పండు మాస్టర్, జ్యోతి, రాయల్ మెక్ రమణ, తేజస్విని గౌడ, శివ్ కుమార్, చంద్రహాస్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే వీరిలో ఎవరెవరు నిజంగా బిగ్‌బాస్ హౌస్‌లోకి ప్రవేశిస్తారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే ప్రస్తుతం ఎక్కువగా వినిపిస్తున్న పేరు టెలివిజన్ నటి పల్లవి గౌడది. పలు సీరియళ్ల ద్వారా ప్రేక్షకులకు చేరువైన ఆమె, తన అందం, నటనతో మంచి అభిమాన వర్గాన్ని సంపాదించుకుంది. సోషల్ మీడియాలో కూడా ఆమెకు విశేష ఆదరణ ఉంది. దీంతో ఈసారి బిగ్‌బాస్ హౌస్‌లో పల్లవి గౌడ కనిపించే అవకాశాలు ఉన్నాయంటూ వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆమె ఎంట్రీ ఇస్తే షోకు గ్లామర్‌తో పాటు భారీ స్థాయిలో ప్రేక్షకాదరణ కూడా లభించే అవకాశం ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రచారాలపై బిగ్‌బాస్ నిర్వాహకులు లేదా పల్లవి గౌడ నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అధికారిక కంటెస్టెంట్ల జాబితా విడుదలైన తర్వాతే ఈ విషయంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అవకాశాల కోసం తెలుగమ్మాయి ప్రయత్నాలు

తెలుగు సినీ పరిశ్రమలో చిన్న చిన్న పాత్రలతో తన ప్రయాణాన్ని ప్రారంభించి, హీరోయిన్‌గా గుర్తింపు పొందేందుకు కృషి చేస్తున్న నటి పూజిత పొన్నాడ మరోసారి వార్తల్లో నిలిచారు. నటనతో పాటు సోషల్ మీడియాలోనూ చురుకుగా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి తాజాగా పంచుకున్న ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 2015లో ‘ఉప్మా తినేసింది’ అనే షార్ట్ ఫిల్మ్‌తో కెరీర్ ప్రారంభించిన పూజిత, 2016లో విడుదలైన తుంటరి సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, తర్వాత వచ్చిన ఊపిరి సినిమాలో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అయితే ఆమెకు అసలైన గుర్తింపు తీసుకొచ్చింది రంగస్థలం. ఇందులో హీరో అన్నయ్య ప్రేమించే యువతిగా కనిపించిన పూజిత తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. ఈ సినిమా విజయంతో ఆమెకు మంచి క్రేజ్ లభించింది. ‘రంగస్థలం’ తర్వాత వరుసగా పలు చిత్రాల్లో నటించినప్పటికీ, ప్రధాన హీరోయిన్‌గా భారీ గుర్తింపు మాత్రం ఇంకా దక్కలేదు. ఇటీవల కల్కి 2898 ఏడీ సినిమాలో కూడా చిన్న పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించారు. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లలోనూ నటిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. ఇక సోషల్ మీడియాలో పూజిత పొన్నాడకు ప్రత్యేక ఫాలోయింగ్ ఉంది. ఎప్పటికప్పుడు కొత్త ఫొటోలు, వీడియోలను పంచుకుంటూ అభిమానులతో టచ్‌లో ఉంటారు. తాజాగా ఆమె షేర్ చేసిన స్టైలిష్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు లైక్‌లు, కామెంట్లతో ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. నటనతో పాటు గ్లామర్‌తోనూ ఆకట్టుకుంటున్న పూజిత పొన్నాడకు భవిష్యత్తులో మరిన్ని మంచి అవకాశాలు రావాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# హిట్ కోసం ఎదురుచూస్తున్న అనన్య నాగళ్ల..



టాలీవుడ్‌లో ప్రతిభ, అందం ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అవకాశాలు దక్కకపోవడంతో పోరాడుతున్న హీరోయిన్లలో అనన్య నాగళ్ల ఒకరు. వరుసగా సినిమాలు చేస్తూ నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ తెలుగమ్మాయి, ఒక భారీ కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తోంది. తెలుగు అమ్మాయిలకు ప్రస్తుతం సినీ పరిశ్రమలో మంచి అవకాశాలు లభిస్తున్న నేపథ్యంలో అనన్య నాగళ్ల కూడా తన ప్రతిభతో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ప్రతి సినిమాలో భిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. మల్లేశం సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన అనన్య నాగళ్లకు తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు లభించింది. ప్రియదర్శి హీరోగా నటించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. సినిమాల్లోకి రాకముందు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన అనన్య, నటనపై ఆసక్తితో సినీ రంగంలో అడుగుపెట్టింది. తర్వాత ప్లేబ్యాక్లో నటించిన ఆమెకు అసలైన బ్రేక్ వకీల్ సాబ్ ద్వారా వచ్చింది. ఇందులో ఆమె నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం పలు చిత్రాల్లో నటించినప్పటికీ, అవి బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. అందం, అభినయం రెండూ ఉన్నప్పటికీ అనన్యకు ఇంకా పెద్ద హీరోల సరసన అవకాశాలు రాలేదని అభిమానులు భావిస్తున్నారు. సరైన కథ, సరైన పాత్ర దొరికితే ఆమె కెరీర్ మరో స్థాయికి వెళ్లే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల సోషల్ మీడియా, వివిధ వివాదాలకు సంబంధించిన వార్తలతో కూడా అనన్య పేరు తరచూ వినిపించింది. అయితే వాటన్నింటికీ దూరంగా ఉంటూ తన కెరీర్‌పై దృష్టి సారిస్తోంది. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఆమె తరచూ ఫొటోలు, వీడియోలు పంచుకుంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా అనన్య నాగళ్ల షేర్ చేసిన స్టైలిష్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆమె అందం, సింప్లిసిటీని అభిమానులు ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు. సరైన అవకాశంతో అనన్య మరో పెద్ద విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com